## పెద్ద కథ ప్రారంభం!

# చెప్పి ఏం సాధిస్తావ్?

ఎప్పుడో– కుటుంబ నియంత్రణ ఇంకా ప్రాచుర్యం పొందని రోజుల్లోనే ఇద్దరు కూతుళ్లతో సంసారాన్ని పొదుపు చేసుకున్నారు మాస్టారు. లావణ్య – సీత ఇద్దరు బిడ్డలూ అతడికి రెండు కళ్ళు. వారి చిన్న కుటుంబం లోని చిరుప్రమెదలు వాళ్ళు.

"–నేను సంపాదించే జీతం రాళ్ళతో అమ్మాయిని కాలేజీకి పంపించటం ఎలా కుదురుతుంది కూడదంటే చిట్టి తల్లి బాధ పడుతుందేమో అనాడు భోజనం చేస్తున్నప్పుడు అన్నాడు మాస్టారు

ఏం చేస్తామండీ మనకిక ముందుకు సాధ్యం కాదు ఎవరో తగిన వాన్ని చూసి ఒక ఇంటిదాన్ని చేసామంటే మన ఋణం తీరిపోతుంది చిన్నదానికి ఇంకో నాలుగేళ్ళ దాకా ఫరవాలేదు– అనసూయమ్మ కూడా భర్త మాటలను బలపరుస్తూ తన వంతు ఆలోచనలను బయటపెట్టింది

"–అవును" ముక్తసరిగా అన్నాడు మాస్టారు '–చదువు విషయం మాత్రం నువ్వే ఏదో విధంగా దాని మనసు కష్టపడకుండా చెప్పు .

ఆ రాత్రి కూతుళ్ళకు అన్నం వడ్డిస్తూ ఆ విషయం వెళ్ళబెట్టింది అనసూయమ్మ. "మీ నాన్న గారింకో ఏడాదిలో రిటయరయి పోతున్నారట' నువ్వు కాలేజీకి వెళ్తానంటే ఇబ్బంది "

ఆమె మాటలు పూర్తి కాలేదు నెమ్మదిగా తలెత్తింది లావణ్య విశాలమయిన ఆ కనుదోయిలో పూర్తిగా నిండియున్న భావరాహిత్యం – పెదవి మాత్రం విప్పలేదు

"లేదమ్మా – అక్కను కాలేజీకి పంపి తీరవలసిందే స్కాలర్‌షిప్స్ ఎలాగూ వున్నాయి సీత వెంటనే జోక్యం చేసుకుంటూ అంది

చదవటానికి స్కాలర్‌షిప్ వస్తుందేమో కాని పట్నంలో వుండటానికి – హాస్టలు ఖర్చు అవీ భరించటం వీలవుతుందో ' ఓపికగా చెప్పుకొచ్చింది అనసూయమ్మ

ఏమాత్రం అవుతుందని? మూడేళ్ళు ఇట్టే గడిచిపోతయ్ అనక ఏదో ఉద్యోగం చేసుకోవచ్చు" నొక్కి చెప్పింది సీత

"అదికాదు .." అంటూ ఏదో చెప్ప బోయింది తల్లి కాని చెప్పనీయలేదు సీత "–ఏదికాదు? అక్కను డిగ్రీ చదివించాల్సిందే!" మొండిగా అందీమారు

వారి సంభాషణను శ్రద్ధగా వింటున్న లావణ్య అప్పుడు పెదవి కదిపింది– "సీతా! మీరు మీరే వాదించుకోవటమే కాని నా అభిప్రాయ మేమిటో అడగరూ?" అంటూ తల్లి వైపు చూస్తూ చెప్పింది. "మీకు చదివించే శక్తి వున్నా కూడా– ఇంకా ముందుకు డిగ్రీకి వెళ్ళే ఓపిక మాత్రం నాకు లేదమ్మా నేను చదవనిక అంతే ఇక మీ పోట్లాట చాలించండి'

ఆ మాటలంటున్న కూతురు వైపు ఆశ్చర్యంగా చూసింది అనసూయమ్మ ఆ చూపుల్లో జాలి పరిస్థితులతో– చేదు నిజాలతో నిస్సహాయంగా రాజీపడుతున్న ముద్ద మందారం లాంటి కూతురు పట్ల అంతులేని వాత్సల్యం ఆ చూపుల్లోంచి ఒలికి పడింది

సీత మాత్రం రోషంగా తల ఎగుర వేసింది "నీవెప్పుడూ యింతే అక్కా! అన్నింటికీ కాంప్రమైజ్ అవుతావు నేను మాత్రం ఫ్యూచర్‌లో డిగ్రీ చేసి తీరుతాను . '

సమాధానంగా నవ్వింది లావణ్య ఆ విధంగా పక్క వూరిలోని జూనియర్ కాలేజీ చదువుతో లావణ్య విద్యార్థి జీవితానికి తెరపడింది

* * * * * * * * *

పిండారబోసినట్లుంది వెన్నెల. వాకిట్లో పడుకున్న కాసేపటికి మళ్ళీ చదువు విషయం లేవనెత్తింది సీత

నిజంగానా అక్కా. నిజంగానే నీకు డిగ్రీ చేయాలని లేదా ?' మోచేతిపై లేచి అరచేతిలో చెంపను ఆన్చుకుని పక్కకు వత్తిగిలుతూ అడిగింది చుక్కలను లెక్కిస్తున్న లావణ్య చూపులు తిప్పుకోకుండానే నవ్వింది.

'నువ్వు కూడా నిజంగానే తెలియక అడుగుతున్నావా? ఎదురు ప్రశ్నించింది

ఏం? తెలుస్తే ఎందుకూ అడగటం ?' ముఖం చిట్లించి రెట్టించింది సీత.

అయితే – నా ఇంకో ప్రశ్నకు సమాధానం చెప్పు ' నన్ను పట్నంలోని హాస్టల్లో వుంచి చదివించే శక్తి నాన్నగారికి వుందంటావా–?' సూటిగా అడిగింది చెల్లెలు కళ్ళలోకి చూస్తూ

"అయితే. " అంటూ తడబడ్డ సీత ఈసారి జవాబు చెప్పలేక పోయింది

'అందుకేనే పిచ్చి . చదువుకుంటానూ అని గోల చేస్తే కాదంటాడు నాన్న. ఆయన తన నిస్సహాయతను మనముందు ఒప్పుకోవటం నాకిష్టం లేదు



# కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి



అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను."

సీత కళ్ళలో విస్మయం – స్వచ్ఛంగా నవ్వుతున్న లావణ్య వైపు కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా చూస్తూ వుండి పోయింది ఆ తర్వాత తటాలున ఆమె గుండెల్లో ఒదిగి పోయింది చిన్నపిల్లలా.

* * * * * * *

కుక్కి మంచంలో పడుకున్న మాస్టారుకు కూడా నిద్ర పట్టలేదు. ఆ రాత్రి కూతురి నిర్ణయాన్ని భార్య ద్వారా విన్న తర్వాత అర్థమయింది అతడి హృదయం "తన చేతుల మీదుగా ఎదిగిన మొక్క ఎంత అందమైన పూలు పూస్తూ వుంది! ఎంతగా ఎదిగిపోయిందో తన బిడ్డ!" గర్వంగా అనుకున్నాడు.

ఇంకో ఏడాదిలో తన వుద్యోగం ముగుస్తుంది. అటుపై వచ్చే ప్రావిడెంట్ ఫండ్ – గ్రాట్యుటీతో ఎంత కష్టమయినా సరే– ఏం చేసయినా సరే బంగారంలాంటి సంబంధం తేవాలి. తన బిడ్డ పుట్టినింట్లో కన్నా మెట్టినింట్లో నే ఎక్కువ సుఖపడాలి సంపద లేకుంటేనేం? అష్టయిశ్వర్యాలను మించిన రత్నాలనిచ్చాడు దేముడు.... తనకది చాలు అనుకుంటూ తృప్తిగా పక్కకు వత్తిగిలి నిద్రలోకి జారిపోయాడు; తెలతెలవారి తొలికోడి కూస్తుండగా

* * * * *

"ఈ రోజే తెలిసిన వాళ్ళు నలుగురికి చెప్పి పెడ్తాను మంచి సంబంధం కుదిరితే ముహూర్తాలు కూడా పెట్టుకోవచ్చు".

భర్త మాటలకు హాయిగా నవ్వింది అనసూయమ్మ. "ఏమిటో మరీ అంత తొందర? కుదిరితే మాత్రం ఇప్పుడు చేయటానికి డబ్బులేవీ ..." ఇంకా నవ్వుతూనే అంది

"రిటైరయిన తర్వాత ఎలాగూ డబ్బు వస్తుంది. కదా. . ఎవరయినా సర్దుతారు. ఇన్నేళ్ళబట్టి ఈ వూర్లో ఆ మాత్రం నమ్మకం సంపాదించుకోలేదనుకున్నావుటే?" తనూ ముసిముసిగా నవ్వుతూ అన్నాడు మాస్టారు.

అనుకున్న విధంగా నలుగురి చెవిలో తన అభిప్రాయాన్ని వేసాడు కూడా. ఒకవేళ అవసరమయితే డబ్బులు ఎవరిని అడగాలో కూడా నిర్ణయించుకున్నాడు.

తలిదండ్రుల ఆలోచనలను చూచాయగా గ్రహిస్తూనే వున్నది లావణ్య కూడా.

"–మీ వివాహ మహోత్సవం జరిపించటానికి పెద్దలు నిర్ణయించుకున్నారండీ లావణ్య గారూ!" చేదబావి వద్ద బట్టలు వుతుకుతూవుంటే ప్రక్కనే వున్న రాతి పలకపై కూర్చుంటూ తమాషాగా చెప్పింది సీత.

మనసు ముసిముసి నవ్వులు నవ్వుకుంటూంటే కోపంగా చూసింది లావణ్య "నీకు వేరే పనేం లేదా? వెధవ కబుర్లు చెప్పే బదులు చదువుకో కూడదూ" అంటూ.

"అబ్బో – ఏమీ తెలియని దానిలా పెద్ద బెట్టు. ఇంతకీ తమరికి ఎలాంటి భర్తగారు కావాలో చెప్పగూడదూ? ముందే పెద్దల చెవిన వేస్తే బావుంటుంది?" వుడికించింది మళ్ళీ.

'ఏయ్ . వెళ్తావా లేదా?" సబ్బు నురగను దోసిలిలోకి తీసుకుని విసురుగా లేచిన అక్కను చూడగానే అక్కడినుండి గబుక్కున పారిపోయింది సీత

అననయితే అన్నది కాని ఆమెలోనూ ఒక స్వప్నం కదులాడింది ... ఆరడుగుల ఆజానుబాహువు వుంగరాల జుత్తు. . కొటవాటి ముక్కు బలమైన కౌగిలిలో తననుపొదువుకుంటే ..

ఒక చిన్ని కుటీరంలో అతనూ– తను అంతే!

ఆఫీసరు వుద్యోగం– పుష్కలమయిన సంపద – సాయంత్రం వేళల్లో అలా– అలా తోటలో షికార్లు ...

అలా సాగిపోయిందా కల

ఛ! ఛ! తనేమిటి ఇలా ఆలోచిస్తుంది?

తమ పరిస్థితి తెలియనిది కనకనా!

అంతటి యోగ్యుల్ని తెచ్చే శక్తి నాన్నకు ఎక్కడిదని? ఏదో గంతకు తగ్గ బొంత!

ఎవరో ఒక చిన్న వుద్యోగస్తుని కట్టబెడ్తే వారి భారం తగ్గుతుంది అదే పదివేలు– 'అంతకన్న తనింకేం గొంతెమ్మ కోర్కెలు కోరుకోదు. దేవతల లాంటి తలిదండ్రులను ఎలాంటి స్థితిలో నయినా తను క్షోభ పెట్టదు

'ఏమిటే లావణ్యా' బారెడు పొద్దెక్కింది ఇంకా కాలేదా?" తల్లి కేకతో వూహల్లోంచి బైటకు వస్తూ "ఆఁ . .ఆఁ ... వస్తున్నాను" అంటూ పిండిన బట్టలు ఆరేయటానికని బుజంపై వేసుకుని లేచింది.

* * * * *

ఆనాడు ఆదివారం

"ఇదిగో. . ఏమే ... నిన్నే. ." కాఫీగ్లాసు క్రింద పెట్టి వంటింట్లోకి మరోసారి కేకేసాడు మాస్టారు

"ఆ. .. వచ్చే... ఏమిటా గావుకేకలు..." అంటూ వచ్చింది అనసూయమ్మ కొంగుకు చేతులు తుడుచుకుంటూ.

చేదబావి కవతల వైపున గుబురు మామిడి చెట్టు మొదట్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ కాఫీలు చప్పరిస్తున్నారు అక్కాచెల్లెళ్ళిద్దరూ

"–అమ్మాయిని చూసుకోవటానికి ఆ హైదరాబాదు అబ్బాయి వాళ్ళు శుక్రవారం నాడు వస్తారట! శాస్త్రులు చేత కబురు పంపించారు.. " సంతోషంతో ముఖం వెలిగి పోతూంటే చెప్పాడు

# దీపావళి కథలపై వ్యాస రచన పోటీలో

## రెండవ బహుమతి పొందిన వ్యాసం!

కర్తవ్యం నీ వంతు . భానుమూర్తి ఆలోచన్లు భావాలు, భయాలు చదువుతున్నపుడు నాకిది కథలాగా తోచలేదు ఓ సజీవమైన వ్యక్తి నా కళ్ళ ఎదురుగ్గా నిలిచాడు ఆయనకు మా నుండి తీసుకోవటం ఇష్టం లేదు మా నోట్లో నుండి పలుకు రాగానే అది తనను ఇబ్బంది పెట్టే మాటే అని ఉలికి పాటు భానుమూర్తిలాగే బయట పడదు అందరికీ ఆయనో తెలివైన ప్రాక్టికల్ ఊహలున్న వ్యక్తిలాగా తోస్తాడు ఎప్పుడో భానుమూర్తిలాగే ఒంటరితనం శాపమైనపుడు గాని ఆయనకు అర్థం గాదు బంధాలు అనుబందాలు ఇచ్చి పుచ్చుకోవడం వలన మరింత బలపడతాయనే నిజం ఇన్నాళ్ళు కన్నవాళ్ళని గురించి ఆలోచించని పిల్లల్ని గురించి వ్రాస్తున్న కథలు చదివితే పిల్లల్ని గురించి ఇలాంటి తల్లి దండ్రుల్ని గురించి ఒక్కరూ రాయరేం అని ఆశ్చర్య పోయే వాడిని బహుశా నా ఆలోచనల్లోనే పొరపాటేమో అని సమాదానపడే వాడిని కాని ఈ కథ చదివాక నా ఆలోచనల్లో బలం ఉన్నట్లుగా తోస్తుంది ఇన్నాళ్ళు పిల్లలు మాత్రమే స్వార్థపరులుగా కన్న వాళ్ళను చివరి రోజుల్లో సరిగ్గా చూసుకోలేని కర్కోటకులుగా చూసే వాళ్ళము కాని ఇప్పుడు తలిదండ్రుల్లోనో చివరి వరకు నేను, నా జీవితం అనే ఆలోచన పెరిగి పోయింది అవి కన్నవాళ్ళ తప్పు ఎంత మాత్రం గాదు పిల్లలు స్వార్థపూరితంగా మారటం వల్ల ఏర్పడ్డ పరిణామం ఇది ఏది ఏమైనా ఓ మంచి కథ, కాదు, కాదు, నిజమైన వ్యక్తి చుట్టూ అల్లబడ్డ ఈ కథనం నా మనస్సుకెంతగా నచ్చిందో చెప్పలేను

**శేషప్రశ్న :** పై కథకు పూర్తిగా విరుద్ధం ఇలాంటి కథలు పత్రికలో ప్రతి దీపావళికి మామూలే కాని చివరిలో సూర్యారావు తండ్రి వ్రాసిన లెటర్‌లోని వాక్యాలు నా కళ్ళ నీరు తెప్పించాయంటే అతిశయోక్తి కాదేమో చనిపోతూ నీ తల్లిపడ్డ ఆవేదనా నిన్ను ఆఖరిసారి చూడకుండానే అనంత లోకాలకు పయనమై పోతున్నందుకు ఆ తల్లి పడ్డ క్షోభ నవ మాసాలు ఆనందంగా మోసి కన్న తన కన్నడిని కడసారిగా చూడాలనీ ఆ మాతృమూర్తి ఆవేదన ఆవేదన మాన్పి, ఆ కళ్ళల్లో చివరిసారిగా వెలుగుల్ని చూడాలనే ఆరాటంతో ఆ వర్షపు రాత్రి నీ యింట ముగిట నిల్చిన నాకు నీ మనసు తెలుసుకున్నాక ఆ పెనుగాలిలో ఆ బయంకర వర్షపాతంలో నీ యింటి వాకట్లోనో ఏ దేవతలైనా కనికరించి నన్ను సమాధి చేయలే దెందుకని? ఆ నరకయాతన నిజంగా ఆ కన్న తండ్రి ఆవేదన ఏ రోజుకైనా కన్న కొడుక్కు అర్థమవుతుందా? కన్న తల్లిదండ్రులను, జీవితాన్నిచ్చి జీవితానికో అర్థమిచ్చిన ఆ దేవతలపైన కనీసం సాటి మనుషులపైన మనిషి చూపాల్సిన కరుణా,

## సహజత్వం ఉట్టి పడుతోంది!

ఔదార్యమన్నా ఈ కన్న పిల్లలు చూపరెందుకని? ప్రతి మనిషి తనను కన్న వాళ్ళను నిర్దాక్షిణ్యంగా ప్రక్కకు తోసి, తను కన్నవాళ్ళ పాదాలు కూడ కందిపోకుండా తన అరచేతులు అడ్డు పెడతారెందుకో? ఇది నిజంగా కన్నవాళ్ళకు తనకు తను కన్నవాళ్ళకు మద్య ఎప్పటికీ జవాబు దొరకని శేష ప్రశ్నే కదూ

**విద్యాదేవి :** అవసరాన్ని మించిన డబ్బు అనవసరపు అలవాట్లకు బానిసను చేస్తుంది కాదనలేని పచ్చి నిజం ఎంత మంది భార్యలు అవసరం లేకున్నా హోదాకోసం గౌరవం కోసం నలుగుర్లో గొప్పగా కనపడ్డం కోసం అనవసరంగా ఉద్యోగం చేస్తున్నారు నిజంగా వాళ్ళే విద్యలాగా ఆలోచిస్తే మరో నిరుద్యోగి కుటుంబం నిలబడదా? కాని అలా ఎవరాలోచిస్తారు అందరికీ అవసరాన్ని మించిన సౌకర్యాలు కావాలి ఒకటుంటే మరొక దానికోసం ఆరాటం పోరాటం నిజంగా విద్యలాగా నిస్వార్థంగా ఒక్కరంటే ఒక్కరు ఆలోచించ గలరా? అలా ఆలోచించిన నాడు కొన్ని కుటుంబాలైనా రెండు పూటలా భోంచెయ్యవూ! ఆ రోజు కోసం కనీసం కథలో లాగానైన ఎదురు చూద్దామా!

**గడ్డి గులాబి :** నాది, నా స్వంతం అనుకునే తాపత్రయం . రోజులో ఒక్క నిముషమైనా, నాది, నా స్వంతం అనుకోకుండా గడపటం నిజంగా అసాధ్యం గాదూ? సుశీల అన్నట్టు నిష్కామంగా ఎవరైనా సేవ చెయ్య గలరా? నిష్కామ కర్మ చేసి ఫలాన్ని ఆశించని వాడిని ఏ కర్మలు బంధించవు నిజమే కాని ఆలోచించే చిత్తస్థైర్యం ఎవరి కుంది? అప్పుడు నిజంగా మనం యోగులమై పోమా?

**పులి :** ఈ రాజకీయాల పులులకు ఎన్ని మేకలు బలై పోతున్నా, వాటికి అర్థమవుతుందా? ఒక వైపు అమాయకులు, మరొక వైపు విద్యార్థులు రాజకీయ యజ్ఞానికి సమిధలై పోతున్నారు ప్రసాదరావు ఆయన కొడుకు చంద్రరావు ఈ రాజకీయ పులుల మధ్య నూకాలమ్మ, పోతురాజు పల్లాలమ్మ సమిధలై మాడిపోయారు ఈ రాజకీయపు మత్తుకు లొంగి పోయి పదవి అనే పారవశ్యంలో మునిగిన నూకాలమ్మకు అంతా పోగొట్టుకున్న తర్వాతగాని ఏం పోయిందీ అర్థం గాలేదు కాని ఒక్కటి నిజం ఎప్పటికీ పెద్ద వాళ్ళు ఎన్ని కక్ష్యలున్నా వాళ్ళకు, వాళ్ళ పిల్లలకు వాళ్ళ హోదాలకు గౌరవాలకు లోపం రాదు కాని ఈ ఎత్తుగడల మధ్య చిక్కి బలైపోయేది నూకాలమ్మ, పోతురాజు, పల్లాలమ్మ లాంటి వాళ్ళే. ఎన్ని జరుగుతున్నా, ఎన్ని చూస్తున్నా వీళ్ళలో చైతన్యం రాదెందుకో? బహుశా దీపం వెలుగుకు భ్రమసి మాడిపోయ్యే దీపం పురుగులు కాబోలు వీళ్ళు

**– ఆర్. విశ్వనాథరెడ్డి, అనంతపురం**

## చచ్చి ఏం సాధిస్తావ్?

'శుభం కానీ నసిగింది అనసూయమ్మ

శుభమంటూనే కానీలూ- అర్థణాలేమిటే మధ్యలో '

అది కాదండీ అబ్బాయి హైదరాబాదులో లెక్చరరు వుద్యోగం చేస్తున్నాడన్నారు పైగా స్థితిపరుడు మన అమ్మాయిని ' మళ్ళీ గొణుక్కున్నట్లుగా అంది అనసూయమ్మ

'అయితే-? అయితే ఏం? పిచ్చి మొహమా' మనమ్మాయికేం తక్కువయిందని? పువ్వు లాంటి బిడ్డ. చిదిమి దీపం పెట్టుకోవచ్చు అసలు మన అమ్మాయిని చేసుకోవటం వారి అదృష్టమే " ఏదో చెప్పి నవ్వుతున్న కూతురును గమనిస్తూ అన్నాడు మాస్టారు

మనమ్మాయికి తక్కువయిందని కాదు కట్నం కానుకలు మళ్ళీ అర్థాంతరంగానే ఆపేసింది

అదా నీబయం' చూడు అనసూయా నీకు లోకజ్ఞానం తక్కువ అందరూ డబ్బు మనుష్యులే వుందరు సాంప్రదాయాలు- సంస్కారాలను గౌరవించేవారు కూడా ఇంకా మిగిలివున్నారే

అబ్బాయి బాగా చదువుకుని నలుగురికి విద్యాదానం చేస్తున్నాడు డబ్బుకు కక్కుర్తి పడే రకంలా లేదు అయినా- మనం మాత్రం ఏమి యివ్వమంటున్నామా? పదిహేనువేల పైగా వస్తుందిట రిటైరయినాక కావాలంటే అంతా యిచ్చేద్దాం బిడ్డ సుఖం కన్నా మనకు కావలసిందేముందని " కుర్చీలో జారగిలబడి ఇంటికప్పు కేసి చూస్తూ కలలో మాదిరి చెప్పుకు పోయాడు మాస్టారు

లావణ్యను చూడటానికి పెళ్ళి వారొస్తున్నారన్న వార్త తెలిసినాక ఆ యింటి వాతావరణమే మారిపోయింది

గోడ-గోడా మూల-మూలా దులిపి శుభ్రం చేసారు ఇల్లంతా అలికి ముగ్గులతో నింపేసారు వూళ్ళోని పెద్దలందరికీ ఈ విషయం తెలియపర్చాడు

చూస్తారు. అతడికి ఎక్కడా ఒక్క క్షణం సేపు కాలు నిలవటం లేదు. ఇక సీత సంగతి సరేసరి! స్నేహితులందరికీ ఇంటింటికి తిరిగి చెప్పి వచ్చింది. తన అక్క పెళ్ళి కాబోతూందని కనిపించిన ప్రతి పక్షికి- వాకిళ్ళల్లోని ప్రతి మొక్కకు -చెట్టుకూ- పుట్టకూ ఒకటనేమిటి ప్రకృతి మొత్తానికి చాటి చెప్పింది. మూడు రోజుల ముందే ఇరుగు పొరుగు వారిళ్ళలో నుండి అందంగా వున్న పది కుర్చీలను సేకరించి వరండాలో వేసారు. అనసూయమ్మ మరో ఇద్దరి పనివాళ్ళ సహాయంతో ఏవేవో పిండివంటలు చేయటంలో నిమగ్నురాలయింది.

అసలు ఆ యింట్లో పెండ్లి చూపులు కాదు- ఇంకో నాలుగు రోజుల్లో పెళ్ళే అన్నట్లుగా వుంది వాతావరణం.

ఏ ఆర్భాటం లేకుండా వున్నది ఒక్క లావణ్య మాత్రమే.

ఏవేవో వూహలు – సందేహాలు అదేపనిగా ముప్పిరిగొంటూంటే నిర్లిప్తంగా అందరినీ గమనిస్తూ వుండిపోయింది.

అతడేవరో లెక్చరరట! అందగాడు! ఆస్తిపరుడు. తనలో ఏం చూసి చేసుకుంటాడు?

అందమా? చదువా?

ఏం తను అందంగా లేదా? ఏమో?

లేచి అద్దంలో చూసుకుంది తదేకంగా- పరీక్షగా చూసుకున్నాక తృప్తి పడింది. ఫరవాలేదు! తనూ అందగత్తే!

మళ్ళీ అంతలోనే మరో సందేహం. అదే అతి ముఖ్యమైన విషమ సమస్య.

అతడు కోరినంత కట్నం యివ్వగలరా తాము?

ఇంకో ఆరు నెలల్లో పదిహేను వేలు వస్తుందట నాన్నగారికి

అంత మొత్తానికి ఒప్పుకుంటారా? అందునా లెక్చరరు- స్థితిపరుడు .... ఏమో!

అనుకూలంగా ఎంత ఆలోచిద్దామనుకున్నా మనస్సు మాత్రం ఎదురు తిరగ సాగింది.

ఆ సమయంలో తన స్నేహితురాలు మాధవి గుర్తొచ్చింది.

వాళ్ళు కాస్త వున్నవాళ్ళే. మాధవి కూడా అందంగా వుంటుంది. అతడు బ్యాంకు ఆఫీసరు..... అమ్మాయిని ఒప్పుకున్నారు. కట్నం వద్దే వచ్చి పడింది చిక్కు.

స్కూటరు కొనిచ్చి ఏభయి వేలు యిస్తామన్నారు వీళ్ళు. కారుతో పాటు ఏభయి వేలు కావాలని పట్టు పట్టారు వాళ్ళు. చివరికి ఆ సంబంధం వదులుకోవలసి వచ్చింది.

తన అదృష్టం ఎలా వుందో? నాన్న మాత్రం ఎక్కడి నుండి తేగలడు? ఈ ఇల్లు తప్ప మరే ఆస్తీ లేదు అప్పు చేద్దామన్నా ఏం చూసి ఇస్తారు.....

అయితే ఈ సంబంధం కుదరనట్టేనా?

ఏమో?



## జానకీ రామచంద్రన్

"వి.ఎన్. జానకీ, నేనూ 18 సంవత్సరాలు కలిసి మెలిసి జీవించిన తర్వాతే న్యాయశాస్త్ర రీత్యా వివాహం చేసుకున్నాం", అంటూ కీ శే శ్రీ ఎం జి ఆర్ వేలూరులో హాజరైన ఓ వివాహ మహోత్సవంలో వధూవరులను ఆశీర్వదిస్తూ తెలిపారు. ఆశ్చెరువుతో ఆ వార్తను తమిళ పత్రికలు అప్పట్లో ప్రముఖంగా ప్రచురించాయి

వి ఎన్ జానకి కేరళ ప్రాంతీయురాలు 1924 సెప్టెంబర్ 23న జన్మించారు 13వ ఏట మద్రాసుకు వచ్చినప్పుడు ఇన్బ సాగరం అనే తమిళ చిత్రంలో నటించారు దురదృష్ట వశాత్తు ఆ చిత్రం విడుదల కాలేదు 1940లో 'కృష్ణ మాయ' అనే చిత్రంలో నటిస్తున్నప్పుడు ఈమెకు గణపతి భట్ అనే హాస్య నటుడితో వివాహం జరిగింది. ఈయన మేకప్‌మన్ కూడా. అప్పటి ప్రగతి స్టూడియోలో ఛీఫ్ మేకప్‌మన్‌గా ఉండేవారు. దరిమిలా హాస్య నటుడుగా పలు చిత్రాలలో నటించి, అస్తమించారు. వీరికి సురేంద్ర అనే అబ్బాయి జన్మించాడు.

1950లో జానకి "మరుదనాట్టు ఇళవరిసి' అనే చిత్రంలో నటిస్తుండగా ఆ చిత్రంలో హీరో ఎం. జి. ఆర్. తో పరిచయం ఏర్పడి, ప్రణయం మొగ్గ తొడిగింది.

ఎం. జి. ఆర్. తర్వాత ఈమె తమిళనాడు ముఖ్యమంత్రి పదవిని కొన్ని రోజులపాటు అలంకరించారు.

-(జి వి జి.)

అన్నీ సమాధానాలు లేని ప్రశ్నలే!

అలసిపోయి పడుకుంది చివరికి.

* * * * *

అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న ఆ శుక్రవారం రానే వచ్చింది. ఉదయం పదిగంటలకల్లా టాక్సీ వచ్చి ముంగిట్లో ఆగింది.

లేచినప్పటి నుండీ వసారాలోనే పచార్లు చేస్తున్న మాస్టారు గుబగుబలాడే గుండెలతో ఎదురు వెళ్ళారు. కొంత సేపటి క్రితం దాకా మాటి మాటికి వీధి చివరిదాకా వెళ్ళి పెళ్ళి వారికోసం చూసిన సీత హడావుడి గా లోనికి పరుగుతీసింది ఆడవాళ్ళకి విషయం చెప్పాలని.

పెళ్ళికొడుకు భాస్కరం- అతడి తల్లీతండ్రీ- అక్కా, చెల్లీ కూర్చున్నాక-

"ఇంకెందుకండీ మాస్టారూ ఆలస్యం? మళ్ళీ వర్జ్యం వచ్చేస్తుంది-" వాచీ చూసుకుని అంటూ 'అమ్మాయిని తీసుకు రండి' పురమాయించారు శాస్త్రులు.

తలుపు చాటున నిలబడి భాస్కరాన్ని గమనిస్తున్న సీత ఆ మాటలు వింటూనే లోనికి వెళ్ళింది.

"లావణ్యా! వాళ్ళడిగిన వాటికి ధైర్యంగా సమాధానం చెప్పు తల్లీ... భయపడవద్దు...." చెప్పుకు పోతూంది అనసూయమ్మ.

"అక్కా..... నీ కాబోయే శ్రీవారు అచ్చం శోభన్‌బాబులా వున్నారు తెలుసా..." చెవిలో గుసగుసగా చెప్పింది సీత.

ఆ మాటలకు కొడతానన్నట్లు చేయి లేపింది లావణ్య. కాని అంతలోనే పెళ్ళి కొడుకు రూపం వూహల్లో కొచ్చి బుగ్గలు ఎఱుపెక్కినయ్యి.

నిజంగానా? అంత అందంగా వుంటాడా?

సీత ఏడిపించటానికి అన్నదా- నిజంగానే

"ఛీ! వెధవ జన్మ యింతకన్నా చావటం మేలు!" అన్నది కూతురు మున్నీ.

"ఏం ఎందుకని?" తల్లి మైథిలి ప్రశ్న.

ఇది ఏమిటనుకుంటున్నారా? వచ్చే సంచిక చూడండి



# మరపురాని అనుభవాలు

"ఆలిండియా రేడియోలో వార్తలు చదివేటప్పుడు, నేను నా మామూలు డ్రస్ అయిన గౌన్ లోనే ఉంటాను గాని, టిలివిజన్‌లో వార్తలు చదివేటప్పుడు మాత్రం చీర ధరించాలి.

అప్పటికి నేనింకా చీర కట్టుకోడానికి బాగా అలవాటు పడని రోజులు..... ఒక సారి దూరదర్శన్‌లో వార్తలు చదివేటప్పుడు నా చీర కొంగు తొలగి పోయినా— అది గమనించకుండా అలాగే వార్తలు చదివేశాను!

పైగా.... టి. వి. లో 'క్రోమా ఎఫెక్ట్' మూలంగా నీలంరంగు దుస్తులు ఎవరూ ధరించ కూడదు. ఆ విషయం మరచి ఒకసారి నేను నీలం రంగు చీరతో నే 'కేంద్రాని'కి వెళ్ళాను. అక్కడ అధికారులు ఆ చీర మార్చేయాలన్నారు. ఇంటికి వెళ్ళి చీర మార్చుకు రావడానికి వ్యవధి లేదు. అక్కడి కాస్ట్యూమ్స్ గది తాళం వేయబడి ఉంది. నాకేం చేయడానికీ తోచలేదు. ఇంతలో ఒక చోట ఓ కర్టెన్ కనిపించింది. దానిని నేను కెమెరాలో కనిపించే మేరకు నా భుజం చుట్టూ కప్పుకొని, అది జారి పోకుండా అక్కడక్కడ గుండు సూదులు గుచ్చుకొని, ఆ రోజు వార్తలు చదివానన్న మాట!" అంది రినీ సైమన్.

ఈమె స్వస్థలం కేరళ: కాని, ఈమెకు మలయాళం అంతగా రాదు. తండ్రి డిఫెన్స్ శాఖలో ఉన్నతాధికారి. తల్లి ఢిల్లీలో ఒక స్కూల్ హెడ్‌మిస్ట్రెస్. తమ్ముడు ఇటలీలో ఉద్యోగి.

"వివాహ మయ్యాక కూడా నేను వార్తలు చదవాలి. నా కాబోయే భర్తకు నేను చెప్పే మొట్ట మొదటి షరతు ఇదే", అంటుంది రినీ సైమన్.

—(జి. వి. జి.)

అంటున్నదో అంతు పట్టలేదు.

వారి ముందుకు వెళ్తున్నప్పుడు మాత్రం తల పూర్తిగా వాలిపోయింది నేలపై వేసిన పీటపై కూర్చున్నదన్న మాటే కాని కళ్ళెత్తటానికి ధైర్యం చాల లేదు పచ్చని పాదాలకు రాసుకున్న పారాణి వైపే తదేకంగా చూస్తూండి పోయింది

'అమ్మాయి చాలా బిడియస్థురాలి లా వుందే... కాస్త తలెత్తు తల్లీ. " పెండ్లి కుమారుని తల్లి అంది

"ఏమో దిష్టి తగులుతుందని భయపడుతూందేమో?" భాస్కరం చెల్లెలు ఓ విసురు విసిరింది కిసుక్కున నవ్వుతూ.

ఇవేమీ వినబడటం లేదు లావణ్యకు. తన, ఆలోచనలలో తనుండి పోయింది

వింటున్న మాస్టారు— అనసూయమ్మల గుండెల్లో దడ హెచ్చింది

సీత మాత్రం లావణ్య నడుముపై మెల్లిగా గిల్లింది.

అప్పుడు— వులిక్కి పడి చూసింది లావణ్య.

తన వైపే ఆతృతగా చూస్తున్న అతడి కళ్ళలోకి ఆమె చూపులు సూటిగా దూసుకుపోయినయి.

"బావున్నాడు.." ఆ ఒక్క సెకనులోనే చెప్పేసింది మనసు.

"విజయశాంతిలా అందంగా వుంది" అనుకున్నాడు అతడు కూడా.

"పేరేమిటమ్మా—" ఆ క్షణం నిశ్శబ్దాన్ని భాస్కరం అక్కగారు భంగపరచటంతో తడబడింది లావణ్య.

## చచ్చి ఏం సాధిస్తావ్

"ఆఁ... ఆఁ.." అంటూ ఆమె అడిగిందేమిటో వినిపించనట్లు — అర్థం కానట్లు చూసింది.

"అదే తల్లీ.... తమరి నామధేయం..." దీర్ఘం తీసింది భాస్కరం చెల్లెలు.

ఆమె ధోరణికి సీతకు వళ్ళు మండి పోతున్నది. 'వెధవ ఫోజు— వేరే సమయంలో అయితేనా— ఏడిపించి— ఏడిపించి కాళ్ళు పట్టుకునేలా చేసేదాన్ని— బోడి!" కసిగా అనుకుంది.

అంతలోనే సన్నగా వీణా వాద్యంలా ఉచ్చరించింది లావణ్య కంఠం తన పేరును.

అలా— అలా దాదాపు ఇరవయి నిమిషాల పాటు సాగింది. ఒక్క భాస్కరం మినహా అందరూ తమ సందేహాలను అనేక విధాలుగా తీర్చుకున్నారు. అంతసేపూ ముళ్ళపై కూర్చున్నట్లు అనిపించింది లావణ్యకు.

మాస్టారు దంపతుల మనోస్థితి అయితే వేరే చెప్పనలవి కాదు. కూతురు పెదవి కదిపినప్పుడల్లా ఆదుర్దాగా చూస్తూండి పోయారు. ఆమె సమాధానం వారిని సంతృప్తి పరిచిందా అని పెళ్ళి వారి హావభావాలను జాగ్రత్తగా గమనిస్తూ వుండిపోయారు. అయితే— అప్పుడప్పుడే యౌవనంలోకి ప్రవేశిస్తున్న సీతకు మాత్రం చాలా అసహనంగా వుంది.

"ఏమిటీ చూపులు— ఎన్నో జతల కళ్ళు ఒక వ్యక్తిని నిర్దాక్షిణ్యంగా తూట్లు పొడవటం, సంతలోని వస్తువులా ప్రాణమున్న ఆ వ్యక్తిని అన్ని కోణాల నుండి... పరిశీలించటం— ఛ! ఛ! తను మాత్రం ఏమయినా కానీ ఇలాంటి పెళ్ళి చూపులు తతంగానికి ఒప్పుకోదు!"

ఎట్టకేలకు వారి ప్రశ్నల పరంపర ముగిసింది.

"ఇక అమ్మాయిని లోనికి తీసుకు వెళ్ళండమ్మా.. చివరికి పెళ్ళి కుమారుని తల్లిగారి పర్మిషను లభించటంతో తడబాటుగా లేచి వడివడిగా లోనికి వెళ్ళింది లావణ్య చెల్లెలు తోడు రాగా.

కూతుళ్ళిద్దరూ కనుమరుగయ్యే దాకా చూసి పెళ్ళివారి వైపు తిరిగాడు మాస్టారు. అతడి కుర్చీ వెనకాల బుజాల నిండుగా కొంగు లాక్కుంటూ నిల్చుంది అనసూయమ్మ.

లోకాభిరామాయణం మధ్య టిఫిన్లు— కాఫీలు పూర్తయినయి.

అసలు విషయం కదపమన్నట్లుగా శాస్త్రులు వైపు చూసాడు మాస్టారు. అతడి చూపుల్లోని సారాంశాన్ని గ్రహిస్తూనే గొంతు సవరించుకున్నాడతను.

"ఆఁ... ఒక తంతు ముగిసింది... శుభం! ఇక మీ అభిప్రాయం పైనే మిగతా కార్యక్రమమంతా ఆధారపడి వుంది. అది కూడా తేల్చి వేస్తే...."

వచ్చిన వాళ్ళంతా ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు కళ్ళలోనే ముచ్చటించుకున్నారు.

"అమ్మాయి మీకు నచ్చితే... ఏదో బావగారూ! నాకు వున్నదాంట్లోనే ఏదో యిచ్చుకుంటాను." అతి ప్రయాసతో గొంతు పెకల్చుకుని నెమ్మదిగా అన్నాడు మాస్టారు ఆశగా వరస కూడా కలుపుతూ.

"అవును బాబూ! ఇంకొద్ది రోజుల్లోనే ఆయన రిటైరయిపోతున్నారు. అవీ— ఇవీ ఎన్నో కొన్ని డబ్బులు చేతికంది వస్తాయట... కూతురంటే వారికి పంచ ప్రాణాలు. వారి శక్తికి తగినట్లు కార్యం జరిపిస్తారు..." చెప్పుకు పోయాడు శాస్త్రులు కూడా


లావణ్యను చూడగానే భాస్కరం ముఖంలోకి వచ్చిన వెలుగు ఇంకా అలాగే వుండి అతడు పూర్తిగా సంతృప్తి చెందినట్లు అందరికీ స్పష్టంగా తెలుస్తూనే వుంది. కాని తలిదండ్రుల ముందు మాట్లాడటం లేదు. అందరి సంభాషణ వింటూ శ్రోతగానే మిగిలిపోయాడు.

"సరేనండీ మాస్టారుగారూ! రెండు మూడు రోజుల్లో మా నిర్ణయాన్ని తెలియచేస్తాము— చివరికి తన రూలింగిచ్చేసాడు భాస్కరం తండ్రిగారు.

ఏమనాలో తోచలేదు మాస్టారికి. చేతులు నలుపుకుంటూ వారు కారు ఎక్కే దాకా దీనాతిదీనంగా చూస్తూ వుండిపోయాడు. భర్తను ఆ స్థితిలో చూస్తున్న ఆ భార్య పేగులు తెగిపోయినయి. అయినా— ఆమె మాత్రం ఏం చేయగలదు? నిస్సహాయురాలు!

(ఇంకా ఉంది)

# చచ్చి ఏం సాధిస్తావ్? — కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి



(గత సంచిక తరువాయి)

ఆ తర్వాత అంతులేని నిరీక్షణ ప్రారంభ మయింది ఆ గడపలో

"చెప్పవే అక్కా. అబ్బాయి నచ్చాడా?" మామిడి చెట్టు మొదట్లో కాళ్ళ చుట్టూరా చేతులు పెట్టుకొని మోకాళ్ళపై గడ్డం ఆనించి చూపుడు వేలితో నేలపైగీతలు గీస్తున్న లావణ్య ఆ మాటలు వినలేదు.

"ఏయ్ నిన్నే ఏమిటీ వాలకం? చూడబోతే అప్పుడే స్వప్న సామ్రాజ్యం లోనికి దూరిపోయినట్టున్నావే " బుజాలు పట్టి కుదుపుతూ అల్లరిగా అంది సీత

అప్పుడు కాని వాస్తవంలోకి రాలేదు లావణ్య – "ఏమిటే నీ గొడవ" – అంటూ అందంగా విసుక్కుంది

ఆ విసుగును పట్టించుకోలేదు సీత. ముక్కుపట్టి అటూ ఇటూ ఊపుతూ ఇంతకు ఆయనగారు నచ్చారా లేదా. " అంటూ రెట్టించింది

అప్పుడు మాత్రం చెల్లెలివైపు మందహాసంతో చూసింది లావణ్య. సీత ఎప్పుడూ యింతే! కొండ రాళ్ళపై నుండి పారే సెలయేరులా గలగలమని దుముకుతూ వుంటుంది మనసులోని ఏ భావాన్ని కూడా – అదెంత కఠినమైనదైనా – సున్నితమైనదైనా సరే దాచుకునే ప్రయత్నం చేయదు

వాళ్ళెప్పుడూ తోబుట్టువులుగా పెరగలేదు. బలమైన స్నేహబంధమొకటి వారిద్దరినీ పెనవేసుకుని పోయింది చూస్తున్న కొద్దీ చెల్లెలుపై అనురాగం పెరిగిపోయింది లావణ్యకు

మృదువుగా ఆమె చెంపను స్పృశించింది "సీతా అంటూ– 'నీవద్ద నాకు దాపరికాలెందుకు – ఆయన నాకు పూర్తిగా నచ్చారు" చెప్తుంటే కళ్ళలోకి సిగ్గూ, చెంపల్లోకి ఎరుపూ పొంగుకొచ్చినయి

'హాయ్ దొంగా ! మరి చెప్పవేమిటి . అయితే వారిని ఇక బావగారూ అని పిలవొచ్చనుకుంటా' ఓహ్ మై డార్లింగ్!' అంటూ గట్టిగా వాటేసుకుని ఆ ముఖాన్ని ముద్దులతో ముంచెత్తింది లావణ్య ఎంత పెనుగులాడినా వదలకుండా

* * *

అబ్బాయి బాగా చదువుకున్నాడు సంస్కారి అన్నిటికన్నా ముఖ్యంగా అతడికి మనమ్మాయి బాగా నచ్చినట్లనిపించింది తనకు తానే చెప్పుకుంటున్నట్లుగా అన్నాడు చేతులు వెనక్కు కట్టుకొని వసారాలో అసహనంగా పచార్లు చేస్తున్న మాస్టారు

ముందున్న గోంగూర కట్టలను విడదీస్తున్న అనసూయమ్మ నిండుగా నవ్వింది చేస్తున్న పని ఆపకుండానే

'ఎందుకంటా ఆ నవ్వు నవ్వటం ఆపి అడిగాడు

మాన్నారు.

"మరేమిటండీ! ఉదయం నుండీ అవే మాటలను కనీసం వందసార్లయినా చెప్పి వుంటారు. రెండు రోజుల్లో తెలియజేస్తామన్నారుగా ... ఇవాళో . రేపో..."

'అది కాదు అనసూయా.. అమ్మాయి నచ్చిన తర్వాత ఇక వేరే విషయాల్లో అభ్యంతర మేముంటుంది? ఎలాగూ ఇంకో రెండు నెలల్లో నా డబ్బు అందుతుంది. పదిహేను ఇరవై వేలల్లో మనకు కలిగినంత పెట్టుకుందాం. నలుగురు మెచ్చే విధంగా మన బిడ్డ పెళ్ళి జరిపిద్దాం... ఏమంటావు...?" అవసరం లేకపోయినా ఆమె అభిప్రాయాన్ని అడిగాడు కుర్చీలో కూలబడుతూ.

భర్త అరాటానికి మళ్ళీ నిండుగా నవ్వింది ఆమె 'ఏమంటానండీ – మీరేదంటే నేనూ అదే అంటాను"– అంటూ

* * *

ఇంటిల్లపాదీ కళ్ళలో వత్తులు వేసుకొని– వళ్ళంతా కళ్ళు చేసుకొని ఎదురుచూసిన ఆ వార్త మరునాడు ఉదయానికి గాని చేరలేదు.

అల్లంత దూరంలో శాస్త్రులను చూస్తూనే బావివద్ద బ్రష్షు చేసుకుంటున్న సీత వేగంగా ఇంట్లోకి పరుగెత్తింది "అమ్మా– ఓ అమ్మా ." అనికేకేస్తూ.

శాస్త్రులు వాకిట్లోకి వచ్చేసరికి అంతా గుమ్మంలో నే స్వాగతం పలికారు

వంటింటి తలుపుచాటున నక్కిన లావణ్య మాత్రం భీతహరిణిలా కళ్ళన్నీ విప్పుకుని చూస్తుండిపోయింది.

కాఫీ తాగిన తర్వాత నింపాదిగా బయటపెట్టాడు శాస్త్రులు

"అమ్మాయి అందరికీ పూర్తిగా నచ్చింది సాంప్రదాయం నిప్పులాంటిదని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు అన్నీ బాగున్నాయి కాని

"కాని–

ఈ కానీలు– అర్ధణాలే ఈనాటి కన్నెపిల్లల జీవితాలతో దాగుడుమూతలాడుకుంటున్న పిశాచాలు.

అందరూ వూపిరి బిగపట్టారు ఆ తర్వాత విషయం వినటానికి.

'కాని అబ్బాయి పట్నంలో పెద్ద వుద్యోగం చేస్తున్నాడు సుక్షేత్రమయిన పదెకరాల పంటభూములకు ఏకైకవారసుడు అందుకే– అందుకే ఒక స్కూటరు, నలభై వెల రూపాయల నగదూ ఇచ్చేటట్టుంటే ముహూర్తాలు పెట్టుకోవడానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు

ఇదీ వారు పంపిన వర్తమానం

ఆ వార్త విన్న తర్వాత – ఆ కుటుంబ సభ్యుల్లో ఎవరిముఖంలోనూ కత్తివాటుకి నెత్తురు చుక్క లేదు"

పాఠకులకో సవాల్!

# 5 టిట్ ఫర్ టాట్!

**"సైకిల్ అమ్మేసి మద్రాసొచ్చి సినిమాలో చేరా...."**

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి– ఆ "రిపార్టీ" గ్రుచ్చుకోవాలేగాని బాధించకూడదు. రసభరితంగా వుండాలేగాని అశ్లీలం కొట్ట వచ్చినట్టుండరాదు... కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం.ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!– ఈ విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం. సంచిక విడుదలైన వారంలో గా పంపాలి.మర్చిపోకండి. –సం.

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం. బహుమతులు పొందిన రెండూకాక– మరికొన్ని యిక్కడ వేశాము. తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేకపోయాం. లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేదని నిరుత్సాహం పడక మళ్ళీ ప్రయత్నించండి!

**"ఏం గురూ గెడ్డం పెంచుతున్నావే! మళ్ళీ మీ ఆవిడ..."**

## ★ రు. 25 బహుమతి పొందిన రిపార్టీ.

"కాదు బాబూ! ఆఫీసు పనిమీద పంజాబువెళ్తే అవసరం పడ్డది" –పంపినవారు : కె. కారంచేటి, హైదరాబాద్

## ★ రు. 15 బహుమతి పొందిన రిపార్టీ

"అదేం లేదయ్యా - నేను గెడ్డంలో అందంగా ఉంటానని మీ లేడీ టైపిస్ట్ అంటోంది!"

–ఎ. వి. ఆర్. ప్రసాద్, నెల్లూరు

### మరికొన్ని వాగ్బాణాలు

"అదేంకాదుగురూ... గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలనుంది"

–కె ఎస్ మాచన్న, తాళ్ళపూడి

"సన్యాసం పుచ్చుకునే సమయానికి తడుముకోవచ్చునని" –వి. పి ప్రవీణ్, వరంగల్

### లక్కీ పేర్లు :

విజయప్రియ (హైదరాబాద్), కె హేమలత (ప్రొద్దటూరు), బి శ్రీదేవి (తిరుపతి), పి విజయరాధ (ప్రొద్దటూరు), కె లక్ష్మి (బొంబాయి), లకంసాని అనసూయ (మల్లవరం), ఎం శ్రీ వసుధ (ఏలూరు), ఎ ధనలక్ష్మి (పలాస), కాకరపర్తి వరలక్ష్మి సుబ్రమణ్యం (తెనాలి), కె. శృతి (కంభంపాడు), మన్నవ లక్ష్మికాంతమ్మ (విజయవాడ), పెండేకంటి పద్మావతి (ధర్మవరం), కె వి మహేంద్రప్రసాద్ (హైదరాబాద్), సి ఎచ్ శరత్ (అదోని), యు యు యు. (ఎమ్మిగనూరు), బి మధుసూదన్‌రావు (సత్తుపల్లి), ఎ. భాస్కరరెడ్డి (ఒంగోలు), కె. వి. ఎస్ ప్రసాద్ (కందుకూరు), జి. ఉమామహేశ్వర్ (యలమంచిలి), ఎస్ చంద్రశేఖరశాస్త్రి (ఖమ్మం)


# చచ్చి ఏం సాధిస్తావ్

"అదేమిటి శాస్త్రులూ.. అన్నీ నచ్చిన తర్వాత కట్న కానుకల వద్ద ఇంత నిర్మొహమాటంగా వ్యవహరించటం ..." అతిప్రయాసమ్మీద నసిగాడు మాస్టారు చాలా సేపటి తర్వాత

"ఏమో మాస్టారూ ! వారు కూడా చాలా నిక్కచ్చిగా వున్నారు".

"మీరు కాస్త నచ్చచెప్పకపోయారా? మా పరిస్థితి కాస్త వివరించి వుంటే." దుఖం ముంచుకు వస్తున్నది అనసూయమ్మకు నిన్నటిదాకా ఎంతో నమ్మకంతో పెళ్లి ఏర్పాట్లు ఏ విదంగా చేయాలా అని అదేపనిగా చర్చించిన భర్తవైపు చూడలేకపోయింది

ఆ పరిస్థితిలో వారిముందు అక్కడ కూర్చోవటం శాస్త్రులకు కూడా ఇబ్బందిగా తోచింది మీరు. నమ్ముతారో లేదోగాని అమ్మగారూ ! నేను చాలా చెప్పి చూశాను.అమ్మాయిని చిన్నప్పటినుండీ




ఎత్తుకొని తిరిగినవాణ్ని నాక్కూడా బిడ్డలాంటిదే ఎంతో చెప్పాను కాని వారు ఏమాత్రం తగ్గలేదు, తగ్గేలా లేరుకూడా  ఎంతో వేదనగా చెప్పాడు

మాస్టారు మాత్రం మవునంగా కూర్చుండి పోయాడు. కూతుళ్లిద్దరూ మామిడిచెట్టు వైపు నడవటం కనిపించింది అప్రయత్నంగానే అతడి కళ్ళు అశృపూరితాలయినాయి

మొట్టమొదటి పెళ్లి మాటలు – తన జీవితంలో తలపెట్టిన శుభకార్యం – మొట్టమొదటి ప్రయత్నం భగ్నమయింది మొదటిసారిగా తీవ్రమయిన గాయం తాకింది

ఎన్ని కలలు కన్నాడో? తన బిడ్డ జీవితాన్ని ఎంత సుందరంగా వూహించుకున్నాడు. అంత డబ్బు సమకూర్చలేడు తను ఇరవై వేలకు మించి ఒక పైసా కూడా భరించలేడు అమ్ముకుందామంటే వీసమెత్తు వస్తువు– గంటెడు పొలం కూడా లేవే ! హే! భగవాన్!

సర్వస్వం కోల్పోయిన మహరాజులా పడక్కుర్చీలో వెనక్కు వాలి కళ్లకు చేతులడ్డం పెట్టుకున్న మాస్టారును చూస్తుంటే శాస్త్రులు గుండెలు కూడా ద్రవించిపోయినయ్

పోనీండి మాస్టారూ! ఈ ఒక్క ఓటమికే మీరింతగా కృంగిపోతే ఎలా .. వెధవ సంబంధం పూర్తిగా డబ్బు మనుష్యులు. చదువూ– వుద్యోగం వుంటే ఏం లాభం? సంస్కారమే లేకపోయినాక! వెధవది పోతేపోయింది. దీనిబాబులాంటి సంబంధం పట్టుకొస్తాను చూస్తూ వుండండి" ధైర్యం చెప్పాడు తెచ్చిపెట్టుకున్న వుత్సాహంతో

* * * * * *

"నిజంగా ఈ సంబంధం కుదురుతుందనే అనుకున్నాను–" చాలాసేపటి నిశ్శబ్దం తర్వాత హఠాత్తుగా అన్నది సీత.

నిరంతరం ఆమెలో దోబూచులాడే చిలిపితనం ఏకోశానా కనిపించటంలేదు పూర్తిగా దిగాలుపడిపోయింది

చెప్పేందుకు ఏమీ మిగలలేదు లావణ్య మస్తిష్కంలో  అందుకే ఆ మాటలు వినీ విననట్లు వుండిపోయింది ఆమెనలాంటి దైన్య స్థితిలో చూస్తుంటే సీతలోని ఆవేదన మరీ ఎక్కువయింది

"నువ్వేం బాధ పడకక్కా అంతా మనమంచికే అనుకుందాం.' వయసులో చిన్నదయినా, పెద్ద ఆరిందాలా ఓదార్చ ప్రయత్నించింది

"అందుకు కాదు సీతా! ఇదిలా జరిగినందుకు కాదు కాని – కాని సీతా !కొందరి మనుష్యుల జీవితాల్లో డబ్బు ఎంత ప్రముఖ పాత్ర వహిస్తున్నదో అర్థమయినప్పుడు మాత్రం నిజంగా బాధ కలిగింది. ఒకవేళ పొరపాటున అలాంటి వ్యక్తులతో జీవితం పంచుకోవాలంటే కూడా భయం వేస్తుంది సీతా !" నిర్వేదంగా చెప్పింది శూన్యంలోకి పరికిస్తూ.

* * *

రోజులు గడిచిపోతున్నాయి. కాలక్రమంగా మాస్టారు కూడా మొదటి నిరాశలోంచి బయటపడి మళ్లీ పెళ్లి సంబంధాల వేటలో మునిగిపోయాడు

చూస్తూ– చూస్తూ వుండగానే ముప్పయ్యేళ్ళుగా అనుకుంటున్న రోజు రానే వచ్చింది అనాడే మాస్టారు టీచరుగా పదవీ విరమణ చేశారు ఆ రోజుకు అతడిఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుంది కాస్తంత శ్రమకే అలుపు – అప్పుడప్పుడు తెరలు తెరలుగా వచ్చే దగ్గు

ఆ తర్వాత ప్రావిడెంట్ ఫండ్– గ్రాట్యుటీ మిగతా బాపతు తాలూకు పద్దెనిమిదివేల చిల్లర చేతిలో పడింది. భద్రంగా బ్యాంకులో జమచేశారు మాస్టారు కూతురు పెళ్లికి తప్ప – ప్రాణాలు పోయినా సరే అందులోంచి పైసాకూడా ముట్టనని తనకు తానే ప్రమాణం చేసుకున్నాడు.

ఇంకో నెల రోజుల్లో మరో సంబంధం తెచ్చాడు శాస్త్రులు

అబ్బాయి తహసీలు ఆఫీసులో గుమాస్తా, బాగా రాబడి వున్న వుద్యోగం. మొదటి మాదిరంత ఆర్భాటం లేకపోయినా అందరి నరాల్లోనూ మళ్లీ ఒక విధమైన వత్తిడి ప్రారంభమైంది.

పెళ్లిచూపుల తతంగం ముగిసిన తర్వాత ఈసారి అక్కడే వచ్చింది కట్నాల ప్రసక్తి.

"మాస్టారుగారు మొన్నీమధ్యనే రిటైరయ్యారు. ఏదో పది–పదిహేనువేలు వచ్చింది మంచితనం తప్ప మరేమీ సంపాదించలేకపోయారు. అయితేనేం – బిడ్డలను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దారు అయ్యా ఇదీ విషయం! తనవద్ద వున్నదంతా యివ్వటానికి ఆయన సిద్ధంగా వున్నారు ఇక మీరే చెప్పాలి..' చెప్పుకొచ్చాడు శాస్త్రులు

'అంటే మీరు చెప్పిన పది – పదిహేనువేలేగా? పరిస్థితిని అర్థం చేసుకున్న పెళ్లికొడుకు స్థానంలోని సుబ్బారావు నిరాసక్తతగా అన్నాడు అతడి తల్లిదండ్రులు పూర్తిగా పల్లెటూరివాళ్ళు లౌక్యం తెలియని అమాయకులు అందుకే వారిని తీసుకురాకుండా తనే వ్యవహారాన్ని నడిపించదలుచుకున్నాడు సుబ్బారావు

మాస్టారు కూడా ఫలితాన్ని చూచాయగా అంచనా వేస్తూనే వున్నాడు అయినా ఎక్కడో ఏదోమూల చిన్న ఆశాదీపం గుడ్డిగా వెలుగుతూనే వుంది.

"అవునండీ" క్లుప్తంగా చెప్పాడు శాస్త్రులు.

అదోరకంగా నవ్వాడామాటలకు సుబ్బారావు "నేను బియ్యే చదివానండి తహసీలు ఆఫీసులో వుద్యోగం అంటే మాటలు కాదు. జీతం– అదీ కలుపుకొని నెలకు నాలుగువేలదాకా సంపాదిస్తున్నాను.' తలుపువద్ద నిల్చున్న సీతవైపు ఒకసారి చూసి అదే నవ్వుతో చెప్పాడు మళ్లీ "మొన్నటికి మొన్న యాభయి వేలు

## మీ జి. కె. ఎంత? 3

( 1) 'నెపోలియన్ ఆఫ్ ఇరాన్' అని ఎవరిని అంటారు?

( 2) 'జుంకోతబై' ఎవరు?

( 3) "సిటీ ఆఫ్ జాయ్' అనే పుస్తకం వ్రాసినదెవరు?

( 4) భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన మహిళలెవరు?

( 5) భారత దేశంలో మొట్టమొదట ఏ ఏ పట్టణాల మధ్య "డైరెక్ట్ డైలింగ్" సదుపాయం కల్పించబడింది.

( 6) మెమ్‌ఫిస్ ఫ్లాష్ అని పిలవబడే గాయకుడి పేరేమిటి?

( 7) భారతదేశంలో భూగర్భ రైల్వే ఏ ఏ ప్రదేశాల మధ్య కల్పించబడింది?

( 8) తన పుట్టిన రోజు కానుకగా మైక్ టైసన్ నుండి బాక్సింగ్ గ్లౌస్ పొందిన ప్రముఖ వ్యక్తి ఎవరు?

( 9) పాక్ ప్రధాని బేనజీర్ భుట్టో ఆత్మకథ పేరేమిటి?

(10) ఐ. ఎన్. టి. ఎ. సి. హెచ్. విస్తరణ ఏమిటి?

—జె. కె.

(జవాబులు ఈ సంచికలో నే....)

ఇస్తామనివచ్చారు కాని అమ్మాయి నచ్చలేదు నలుపు' ఇప్పుడు మీ అమ్మాయి నాకు నచ్చింది కాబట్టి ముప్పయి వేలకు సరిపెట్టుకుంటాను "

హతాశుడయిపోయాడు మాస్టారు గుండెల అట్టడుగుపొరల్లో మిణుకు మిణుకు మంటున్న ఆశాకిరణం చప్పున ఆరిపోయింది

'అదికాదండీ ' అంటూ శాస్త్రులు కల్పించుకోపోయాడు కానీ సుబ్బారావే మళ్లీ అందుకున్నాడు "-చూడండి శాస్త్రులు గారూ! మాస్టారు గారి మంచితనం గురించి విన్నాను ప్రస్తుతం ప్రత్యక్షంగా చూస్తున్నాను టి వి. ఫ్రిజ్, సోఫాసెట్టూ వగైరాలు ఎలాగూ వుంటాయి కదా- అందుకే చివరికి పాతికకు తగ్గుతాను స్థిరంగా చెప్పాడీసారి

ఇంకెలా నచ్చచెప్పాలో అర్థం కాలేదు శాస్త్రులుకు అప్పుడు- అతడి మౌనంలోని నిస్సహాయతను గమనించి అదురుతున్న గుండెలను అదిమిపడుతూ అప్పుడు- కల్పించుకున్నాడు మాస్టారు

"చూడు బాబూ దయచేసి మీరింత కఠినమైన నిర్ణయాలు చేయకండి నా వద్ద ప్రస్తుతమున్న పదిహేను వేలు పూర్తిగా యిచ్చుకుంటాను పెళ్ళి కూడా ఘనంగానే జరిపిస్తాను అందుకోసం కూడా నలుగురి వద్ద అప్పు చేయవలసిందే నాయనా అయినా సరే ఎలాగో చేస్తాను ఇక వస్తువులు నా శక్తి కొద్దీ ముందు ముందు అన్నీ యిచ్చుకునే ప్రయత్నం చేస్తాను ' చెప్తున్న అతడి కంఠం సన్నగా వణికింది

అయినా - అతడి ధైన్యాన్ని పట్టించుకోలేదు సుబ్బారావు- ఎలా ఒప్పుకోమంటారండీ? వేలకు వేలు యిస్తామని ఎంతో మంది క్యూలో నిల్చున్నారు అయినా- క్షమించండి నాకు తెలియక అడుగుతున్నాను. ముందు ముందు మాత్రం మీరెలా యిస్తారు. ఎలా నమ్మమంటారు?"

గురి చూసి కొట్టిన బాణం లా ఆ ప్రశ్న మాస్టారు నరనరాల్లోకి దూసుకుపోయింది సమాధానం చెప్పలేని నిస్సహాయత ఒక్కసారిగా కన్నీళ్ళు తెచ్చి పెట్టింది దవడ ఎముకలు బిగుసుకు పోతూంటే సుబ్బారావు వైపే కాదు- ఎవరి దిక్కూ చూడలేక పోయాడు అతి నెమ్మదిగా అన్నాడు నేల చూపులు చూస్తూ, "అలా అడిగితే ఏమని చెప్పను? ఏమని చెప్తే మీకు నమ్మకం కలుగుతుంది? నిజమే బాబూ - మీరు సందేహిస్తున్నట్లు నాలో జీవం తగ్గిపోయింది అయినా - రక్తం ఇంకా మిగిలేవుంది ప్రైవేట్లు చెప్పుకుంటాను పచారి కొట్లో పద్దులు వ్రాస్తాను నాలో మిగిలి వున్న ప్రతి రక్తబిందువునూ రూపాయి నోటుగా మారుస్తాను బాబూ! మీ బాకీ తీరుస్తాను ఇంతకన్నా ఇంకేం చేయమంటారు? మీరే చెప్పండి ఇంకేం చేయమంటారు? మీరే చెప్పండి ఇంకేం చేయాలో గొంతు పూడుకు పోతుంటే విపరీతమైన దగ్గుతో పాటు ఆయాసం వచ్చింది రొప్పుతూ ఆగిపోయాడు

మొట్టమొదటిసారిగా తన కన్న తండ్రినంత దీన హీన స్థితిలో చూస్తున్న లావణ్య ఇక భరించలేక పోయింది ముందు గదిలోకి పరుగెత్తుకు వచ్చి ఆయాసపడుతున్న అతడి గుండెలపైన మృదువుగా నిమరసాగింది, చెంపలపైకి కారే కన్నీటిని తుడుచుకునే ప్రయత్నమైనా చేయకుండా

శాస్త్రులు కూడా లేచి మాస్టారు వద్దకు రావటంతో ఒంటరిగా మిగిలిపోయిన సుబ్బారావుకు ఇంకా అక్కడే కూర్చోవాలంటే ఇబ్బందనిపించింది' వెళ్తున్నానని గోడలకు చెప్పినట్లు చెప్పి బయటపడ్డాడు

అతడి నిష్క్రమణాన్ని ఎవరూ గమనించలేదు

వీధి మలుపు తిరుగుతున్నప్పుడు మాత్రం హఠాత్తుగా వినిపించింది పిలుపు చటుక్కున ఆగిపోయాడు

వంటరిగా నడుస్తూ సమీపించింది సీత ఆమె చూపుల్లోనే కాదు ప్రతి కదలికలోనూ అతడిపట్ల స్పష్టంగా ద్యోతకమవుతున్న జుగుప్స

ఇబ్బందిగా చూసాడు సుబ్బారావు

- చూడు సుబ్బారావూ . ఇంకెప్పుడూ మీ చదువును- వుద్యోగాన్ని మార్కెట్లో అమ్ముకోవటానికి ప్రయత్నించకండి సాటి వ్యక్తిని గౌరవించేందుకు- ఎదుటివారి పరిస్థితులను అర్థం చేసుకునేందుకు సరిపడే సంస్కారాన్ని- వ్యక్తిత్వాన్ని కూడా పెంచుకోవటానికి ప్రయత్నించండి మనిషికి- మృగానికీ మధ్య వున్న వ్యత్యాసం అది మాత్రమేనన్న విషయం ఎప్పటికీ మర్చిపోవద్దు ఇది చెప్పటానికే వచ్చాను గుడ్ బై గుక్క తిప్పకోకుండా చెప్పేసి ఎలా ప్రత్యక్షమయిందో - అలాగే అదృశ్యమయింది

మాటలు రాక చేష్టలుడిగి బొమ్మలా నిల్చుండిపోయాడు సుబ్బారావు ఈ హఠాత్పరిణామానికి-

* * * * * * *

ఆ సంఘటన జరిగిన తర్వాత పది మంది పిల్లలను ట్యూషన్లకు కుదుర్చుకున్నాడు మాస్టారు వుదయం- సాయంత్రం వరండాలో తరగతులు నిర్వహించసాగాడు

ఆ దశలోనే అతడి ఆరోగ్యం కూడా బాగా క్షీణించింది అయిదు పది నిమిషాలు పాఠాలు చెప్పేసరికి ఆయాసం ముంచుకు వస్తూంది మధ్య మధ్య భళ్ళున వస్తున్న దగ్గు

-ఎందుకండీ? చెప్పినా వినకుండా ఇంత శ్రమ పడటం ఎందుకు? ఒక్కసారి డాక్టరు వద్దకు వెళ్ళి రండి అంటే వినరు ఇలా అయితే ఎలా భర్త పాదాలు వత్తుతూ అంది అనసూయమ్మ కళ్ళు చెమ్మగిల్లుతూంటే

డబ్బు అనసూయా డబ్బు కావాలి! మన వద్ద వున్న దానితో అమ్మాయి పెళ్ళి చేయలేము అందుకనే ఇంత కష్టపడేది నాకు ఎక్కువ వ్యవధి లేదు అనసూయా- అప్పటిలోగా దాన్నొక ఇంటిదాన్ని చేసి పోవాలి ఈ బ్రతుక్కిక మిగిలింది అదొక్క కోరికే- శూన్యంలోకి చూస్తూ అన్నాడు

పెళ్ళిళ్ళూ - పేరంటాలూ ఏవయినాసరే అన్నీ మీ ఆరోగ్యం తర్వాతేనండీ మీరు క్షేమంగా వుంటే మాకదే పదివేలు దయచేసి రేపొకమారు డాక్టరు వద్దకు వెళ్ళిరండి ఈసారి మాత్రం కన్నీరు జలజలా రాలింది

'పిచ్చిదానా! నా కేమవుతుందే? ఏమీకాదు! నా చిట్టితల్లుల నిద్దరినీ అత్తవారింటికి పంపించిగాని విశ్రాంతి తీసుకోను అప్పటిదాకా నన్ను అడ్డుపెట్టకు' అన్న మాస్టారు బిడ్డల భవిష్యత్తునూహించుకుంటూ కళ్ళు మూసుకున్నాడు.

అదే సమయంలో లోని గదిలోని పరిస్థితి కూడా అలాగేవుంది

"అనాడు అతడిముందు దోషిలా నిలబడి సంజాయిషీ చెప్తూ బ్రతిమాలుకుంటూంటే

ఓహ్! నాన్నను చూడలేకపోయాను సీతా!" మునివేళ్ళతో కణతలు రుద్దుకుంటూ అంది లావణ్య బాధగా.

"వెధవకు అనాడే బాగా బుద్ధిచెప్పానక్కా.... సంస్కారాన్ని నేర్చుకోమని మొహం వాచేలా తిట్టాను."

ఆ విషయం యిప్పటిదాకా ఎవ్వరికీ తెలియదు.

ఆశ్చర్యపోయింది లావణ్య 'అంతమాట అన్నావా' అన్నట్లు చూస్తూ.

"లేకపోతే మరేంటి? బియ్యే చదివాడట.... పైగా లంచగొండి ఉద్యోగం చేస్తున్నాడట.... అందుకు వేలకువేలు కట్నం కావాలట. చెప్పటానికయినా కాస్త సిగ్గుండాలి" ఆనాటి సుబ్బారావును గుర్తుకు తెచ్చుకుంటూ కసిగా అంది.

"సంస్కారమనేది చదువుతో కాని – ఒకరు చెప్తేకాని వచ్చేది కాదు సీతా. ఎవరికి వారే గుండెల్లో విత్తనంగా వేసుకొని పెంచుకోవాలి."

"ఆ ఆలోచన వారిలో లేనప్పుడు తెలియ చెప్పవలసిన అవసరం వుంటుందక్కా– ఆ తర్వాత వారి ఖర్మ! ఇంతకీ నాన్నగారేమంటున్నారూ?"

"ఏమంటారు? ఎలాగయినా సరే నా పెళ్ళి జరిగేంతవరకు విశ్రాంతి తీసుకో నంటున్నాడు. పిచ్చినాన్న– ఎలా? ఎంతని సంపాదిస్తాడు. ఎదుటివారి కోరికలను ఎలా అంచనా వేయగలడు–?"

"బ్యాంకులోంచి కొంత డబ్బు తీసి వైద్యం చేయించుకోండని అమ్మ చెప్తే ప్రాణం పోయినాసరే తీయనన్నారట. ఆయన ఆరోగ్యం ఏమవుతుందో?" నిట్టూర్చింది సీత.

ఆ విషయం తెలిసిన మరునాడు తండ్రిని నిలేసింది లావణ్య. "ఎప్పుడో జరగబోయే నా పెళ్ళికని మీ రిప్పుడు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయటం ఏం సబబు నాన్నా?" అంటూ.

పుట్టింది మొదలు తనముందు పెదవికూడా విప్పని కూతురు మొదటిసారిగా తన నిర్ణయంలోని వివేకాన్ని సవాలు చేస్తూంటే అపనమ్మకంగా చూసాడు మాస్టారు.

"అవును నాన్నా! నా గురించి అనవసరంగా ఆందోళన పడుతున్నారు. మీ జీవితాన్ని ఫణంగాపెట్టి నాపెళ్ళి చేసినా నేను సుఖపడగలనా చెప్పండి" చూపులు మసకబారుతుంటే తండ్రి బుజంపై తలవాల్చుకుంటూ అంది.

కూతురు శిరస్సును ఆప్యాయంగా నిమిరారు మాస్టారు "పిచ్చితల్లీ... నా ఆరోగ్యానికేమయిందమ్మా! ఏదో వూహించుకుని అనవసరంగా బాధపడుతున్నావు. వద్దమ్మా! ఏం చేయాలో – ఏది చేయకూడదో నాకు తెలియదూ? వెళ్ళు! వెళ్ళి కాసింత మజ్జిగ పట్రా" అని, వెళ్తున్న కూతురివంక వాత్సల్యంగా చూస్తూ ఆయన కూడా ఆలోచనలో పడ్డాడు.

అవును! నిజమే! లావణ్య చెప్పిన దాంట్లోనూ సత్యం లేకపోలేదు. ఇది తన ఒక్కడికే పరిమితం కాదు. దేశంలోని ఆడపిల్లల తలి దండ్రుల నందరినీ వేధిస్తున్న విషమసమస్య. పెళ్ళి జరగటం ఒక ఎత్తయితే – ఆ తర్వాత వరకట్నపు చావులు చావకుండా జీవితాంతం బ్రతికి వుండటం మరో ఎత్తు.

ఒక్కోసారి అనిపిస్తోంది. యింతటి జటిల సమస్యకు కూడా సులభమైన పరిష్కారాలు వున్నాయనే అనిపిస్తుంది.

నిజమే! ఒక ఆడపిల్లకు పెళ్ళి అంత ముఖ్యమా? అంటే – అదే జీవిత పరమావధా? చదువుకుని ఉద్యోగాలు చేసుకుంటూ ఆర్థిక స్వాతంత్ర్యంపొంది ఒంటరిగా బ్రతుకుతున్న అమ్మాయిలు ఎంతమందిలేరు.... ఒకటి, రెండేళ్ళు కాపురంచేసినాక భర్తలను కోల్పోయి జీవితాంతం ఎంతమంది ఏకాకులుగా మిగిలిపోవటంలేదు.

అలాంటప్పుడు మరి యింత అవస్థ ఎందుకు– వృద్ధాప్యంలో తనలాంటి తండ్రులకు యింత ఆరాటమెందుకు? తనుమాత్రం తన బిడ్డలను బాగా చదివించి వివాహాలకు తొందరెందుకని ఉద్యోగాలు చేసుకోవటానికి, అవసరమనుకుంటే వారివారి జీవిత భాగస్వాములను వాళ్ళనే నిర్ణయించుకోమని ఎందుకు ప్రోత్సహించటంలేదు?

నవ్వుకున్నాడు మాస్టారు తనలోని ఆలోచనలకు. తమది మధ్యతరగతి కుటుంబం. సమాజంలోని అన్ని వర్గాల్లోనూ అతి హేయమైన తరగతి తమది. ఇక్కడ తనకు కలిగిన ఆలోచనల లాంటివి అమలు చేయాలనుకుంటే సంఘం ఒప్పుకోదు. చుట్టూవున్నవాళ్ళు వాళ్ళకే కష్టం కలిగినంతగా అల్లాడిపోతారు – సూటిపోటి మాటలంటారు – చెవులు కొరుక్కుంటారు వాటిన్నిటి తర్వాత – మాస్టారుగారి అమ్మాయికి పెళ్ళికాకముందే గర్భం వచ్చిందని, అందుకే చదువు నెపంతో, ఉద్యోగం పేరుతో దూరంగా పంపించివేసాడని బాహాటంగా చాటింపువేస్తారు. మనిషి మనసును పూర్తిగా బలహీనపరిచి నిస్తేజుణ్ణి చేస్తారు. మధ్యతరగతి మనిషి తన మార్గాన్ని విడిచి ఎక్కడికో వెళ్ళి బ్రతకలేడు. అందుకు అతడి ఆర్థిక పరిస్థితి సహకరించదు.

అదే వాతావరణంలో పుట్టి పెరిగిన అమాయక కన్నెపిల్లలు యింకెలా భరించగలరు? చుట్టూవున్న సమాజం తెస్తున్న వత్తిడికి తట్టుకోలేక ఏ అఘాయిత్యానికయినా సరే సిద్ధపడతారు.

అందుకేనా?

క్రింది తరగతిలో – పై తరగతుల్లో పెళ్ళిళ్ళ సమస్య వుండదు? వరకట్నాల చావు లుండవు?

అందుకేనా?

ఆర్థిక స్వాతంత్ర్యం లోపించేనా?

పశ్చిమదేశాల్లోని మహిళకు భిన్నంగా ఈ దేశంలోని మధ్యతరగతి స్త్రీ మాంగల్యానికి ఆరాటపడుతున్నది? ఆ తర్వాత అనేకానేక చిత్రహింసలకు గురవుతున్నది? వురిపోసు కుంటున్నది? సజీవ దహనం చేయబడుతున్నది?

అందుకేనా?

తన అభిప్రాయాలతో ఏకీభవించలేని సంఘాన్ని వ్యతిరేకించలేకేనా? ఎదిరించలేకేనా? అంతేనా?

"ఇదిగో నాన్నా" కూతురు పిలుపుతో ఈ లోకంలోకి వచ్చిన మాస్టారు గ్లాసు అందుకున్నాడు.

(ఇంకావుంది)

## యాక్షన్ చిత్రంలో రజనీకాంత్‌తో సుహాసిని



రజనీకాంత్ జంటగా సుహాసిని నటిస్తోన్న తొలి చిత్రం

"ధర్మత్తిన్ తలైవన్" (ధర్మానికి నాయకుడు). ఇది యాక్షన్ చిత్రం. ఇందులోని పాత్ర నచ్చిందా అని సుహాసినిని అడిగితే, "యాక్షన్ చిత్రమైనా- హీరోయిన్‌కు ప్రాముఖ్యత ఉంది గనుక ఒప్పుకున్నాను" అంది. ఈ చిత్రానికి మూలం "బందే హాత్"లో అమితాబ్ బచ్చన్ రాఖి నాయకానాయికలు.

పెద్దకథ

# చచ్చి ఏం సాధిస్తావ్? – కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి

(గత సంచిక తరువాయి)

లావణ్య వెళ్ళినాక – మళ్ళీ ఆయన మస్తిష్కంలో ఆలోచనలు ముసురుకున్నాయి

నిజమే' ఆర్థిక బలంవుంటే ఈ సమాజంతో పోరాడవచ్చు తమ నిర్ణయాలను నిర్భయంగా అమలుచేయవచ్చు అవి తప్పుగానీ – ఒప్పుకానీ

అలా కాకుండా –

పెళ్ళే ముఖ్యమని అనుకుంటే – తన కూతురుకు ఒక మగతోడు తప్పకుండా అవసరమని భావిస్తే అందుకు కూడా పరిష్కారం కనిపిస్తుంది

తమకన్నా దిగువస్థాయిలో వున్న ఒక కార్మికుడికో – ఉద్యోగం లేక చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేవాడికో – చిరు ఉద్యోగం చేసుకుంటున్న ఒక అవిటివాడికో – అందుడికో – కురూపికో – ఎవరికయినా యిచ్చి తన కూతురి పెళ్ళి అతిఘనంగా చేయవచ్చు వాళ్ళవాళ్ళ పరిధుల్లో వాళ్ళు సుఖంగానే బ్రతకడం తను చూస్తున్నాడు

తిండి – బట్టా తప్ప తన కుటుంబంమాత్రం యింకేం అనుభవించిందని?

మరి తనలా చేయగలడా? అమ్మాయిలూ – అనసూయా ఒప్పుకుంటారా? అసలు తామేకాదు – ఈ లోకంలోని ఏ తలి దండ్రులయినా అందుకు సిద్ధపడ్తారా? సమాజం మాత్రం అందుకు హర్షించి – సహకరిస్తుందా?

అన్ని విషయాలూ అటుంచి తను మాత్రం అందుకు సిద్ధమా? వున్నదంతా యిచ్చేసి – ఆ తర్వాత ఏమయిపోయినా సరే అనుకోవటం లేదూ' చివరికి తన ప్రాణాలనుసైతం పణంగా పెట్టడంలేదూ'

అప్పుడు– సమాధానాల్లేని ఆ ప్రశ్నలు వుదయించిన తర్వాత మాస్టారు పెదాలపైన అప్రయత్నంగానే ఒక చిరునవ్వు కదులాడింది

అవును'

అదే పరిష్కారం'

వరకట్న సమస్యకు వున్న ఒకేఒక పరిష్కారమిది'

అది జరక్కపోతే – వీలుకాకపోతే ఇంతే'

ఇలా జరగవలసిందే'

అప్పుడప్పుడే ఎండ చల్లబడుతున్నది. సాయంత్రం పరుగెత్తుకు వస్తూంది

పాఠాలు చెప్పటం దాదాపు పూర్తి కావస్తున్న



తరుణంలో వెదురు కర్రలతో చేసిన గేటును తీసుకొని వాకిట్లోకి వచ్చాడు మధుబాబు

ఆ వూళ్లోని మోతుబరి రాజయ్యగారి ఏకైక కుమారుడు మధుబాబు. మాస్టారు వద్ద ఓనమాలు దిద్దుకుని- విద్యాబీజం నాటుకున్న అతడు వైద్య విద్య పూర్తి చేసాడు పట్నంలోని ప్రభుత్వాసుపత్రిలో వుద్యోగం చేస్తున్నాడు నిండయిన వ్యక్తిత్వాన్ని- పరిపూర్ణమైన సంస్కారాన్ని పుణికిపుచ్చుకున్న మాస్టారి కుటుంబమంటే అతడికి మొదటి నుండి అపరిమితమయిన భక్తిప్రపత్తులు- వూర్లో వున్నన్నాళ్లూ రోజూ రెండు గంటలపాటు మాస్టారుతో గడపటం అతడి అలవాటు.

పిల్లల్ని పంపించి వేసి సాదరంగా ఆహ్వానించాడు మాస్టారు. కుశల ప్రశ్నలవుతూంటే కాఫీ తీసుకుని వచ్చింది లావణ్య

"- బాగున్నావా లావణ్యా ..." గ్లాసందుకుంటూ అడిగాడు చిరునవ్వుతో

"వూఁ ." అంటూ తలాడించింది, అక్కడే ఓ పక్కన కూర్చుంటూ

చిన్నప్పటి నుండీ పరిచయమున్నందు వలన వారి మధ్య బిడియాలు లేవు. చెప్పుకోదగ్గంత చనువు లేకపోయినా ఎదురెదురుగా కూర్చుని మాట్లాడుకునే సాన్నిహిత్యముంది

"ఈ మధ్య ఏమయినా కొత్త పుస్తకాలు చదివావా.. ?" మళ్లీ మధుబాబే సంభాషణ కొనసాగించాడు.

"ఏదీ " అంటూ స్నిగ్ధంగా నవ్వింది లావణ్య- నాన్నగారి చిన్న లైబ్రరీలోని అన్నీ చదివేసాను. " అంటూ.

"ఈసారి వచ్చినప్పుడు చలం సాహిత్యం పట్టుకు వస్తాను మీ లైబ్రరీ కోసం.. " మాస్టారి వంక చూస్తూ చెప్పాడు.

ఆ మాటలకు తనూ చిన్నగా నవ్వాడు మాస్టారు

సంభాషణ క్రమంగా పెళ్ళిళ్ళ వైపు తిరిగింది.

"ఏమో బాబూ ఈ వరకట్నాల సమస్య ఈ మధ్య మరీ ఎక్కువయిపోయినట్లనిపిస్తుంది ఆడపిల్లల తండ్రినని కాదు కాని- ఒక్కొక్కసారి అనిపిస్తుంటుంది మన సమాజం ఎటు పోతుందా అని!"

"మనుషులు- అంటే యువతీ యువకులే కాదండీ గత తరం వాళ్లు కూడా మారాలి అప్పుడు కాని ఈ సమస్య కొంతవరకు తీరదు." అంటున్న మధుబాబు వైపు మెచ్చుకోలుగా చూసాడు మాస్టారు

లావణ్య మాత్రం ఆ సంభాషణలో తలదూర్చలేదు.

మామిడి చెట్టు వద్దనున్న కలుగులోంచి బయటకు వచ్చి అటు- యిటు చకచకా పరుగులు తీస్తున్న ఒక చిట్టిలుకను గమనిస్తూ నిశ్శబ్దంగా వుండిపోయింది.

"ఏం లావణ్యా! మౌనంగా వుండిపోయావ్!" అన్న

పాఠకులకో సవాల్!

6

# టిట్ ఫర్ టాట్!

**నోట్లు... వోట్లు... లేదా పోట్లు... ఇంతేగా ప్రజాస్వామ్యం!**

ఇది ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి- ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలేగాని బాధించకూడదు. రసభరితంగా వుండాలేగాని అశ్లీలం కొట్ట వచ్చినట్లుండరాదు... కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!- ఈ విషయంలో సంపాదకునిదే తుది నిర్ణయం. సంచిక విడుదలైన వారంలోగా పంపాలి.మర్చిపోకండి. –సం.

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం. బహుమతులు పొందిన రెండూకాక- మరికొన్ని యిక్కడ వేశాము. తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేకపోయాం. లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేదని నిరుత్సాహం పడక మళ్లీ ప్రయత్నించండి!

**"ఏంపమన్నావా? ఏం చూశా! మిరపు తగలి! తెలుగుగంగ!"**

★ రు. 25 బహుమతి పొందిన రిపార్టీ:

"ఒక్క నిముషం స్వామీ! కాస్త ఈ పువ్వుని నా చెవిలో పెట్టుకుంటాను". –నవీన్‌కుమార్, (ధర్మవరం)

★ రు. 15 బహుమతి పొందిన రిపార్టీ:

"అవేమీ వద్దుకాని, ఓ గ్లాసుడు మంచినీళ్లు చూడు బ్రదర్!" –వై. రాజ్‌కుమార్ (అనపర్తి)

## మరికొన్ని వాగ్బాణాలు

"తొందరేముంది?.... ఇప్పుడప్పుడే ఎన్నికలేమీ లేవుగా?!"

–ఆర్ వీరరాఘవులు,(సూళ్ళూరుపేట)

"చాల్లే! కోతలు, దమ్ముంటే కట్నంలేకుండా పెళ్ళిచేసుకో!"

–కె జనార్దన్, వేమూరు

"సూర్యుణ్ణి ట్రై చేయకూడదూ? వెరైటీగా వుంటుంది".

–శ్రీనివాసరాజు, గుడ్లవల్లేరు

## లక్కీ పేర్లు:

జి. లలితా కిరణ్మయి (రామవరప్పాడు), టి. రాజగోపాల్ (రాజమండ్రి), కె. వెంకటరమణ (పినపళ్ళ), కె. ఎస్. యాదవ్, (రామచంద్రపురం), ఇ. అహల్య (మచిలీపట్నం), డి. శారద (విశాఖపట్టణం), వి రామారావు (అనపర్తి), జి రమేష్‌బాబు (ప్రత్తిపాడు), బి. నారాయణరెడ్డి (అనంతపురం), వి భారతి (అమలాపురం), బి చిన్నకేశవులు (సుందిపెంట), సురేష్ (నెల్లూరు), సి వి. నరసింహదాసు (విజయనగరం), డి లక్ష్మి (తోగుమ్మి), జి శ్రీనివాసరావు (శ్రీకాకుళం), ఎ ఖలీల్ (చిన ఓగిరాల), సి హెచ్ సత్యనారాయణ (పాలకొల్లు), కె ఎ నమ్మి (పెనుగొండ), ఎస్ ఆనందరావు (ద్రోణాచలం)

మధుబాబు మాటలకు మరొక్కసారి మందహాసం చేసింది ఆమె "ఏం మాట్లాడను?" అన్నట్లుగా

"ఏదయినా సరే! మాట్లాడు " బలవంతం చేస్తున్నట్లుగా అంటున్న అతడి వైపే తదేకంగా చూస్తున్న మాస్టారు మస్తిష్కంలో ఒక మెరుపు తళుక్కున మెరిసింది

అవునూ... ఇది సాధ్యమా?

ఎందుక్కాదు!

చిన్నప్పటి నుండి చూస్తున్నాడు తనేమిటో- తన కుటుంబ పరిస్థితి ఏమిటో క్షుణ్ణంగా తెలిసినవాడు

తన పరిస్థితిని- బాధ్యతలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నవాడు

విద్యాధికుడు వుత్తముడు

వరకట్న దురాచారం సమసిపోవాలంటే మానవుడు మారాలని ఆశిస్తున్నవాడు ఒప్పుకోడా?

తన బిడ్డకేం తక్కువయిందని? సంపద తప్ప లావణ్యకేం లోపించిందని-?

తప్పకుండా ఒప్పుకుంటాడు

ఆలోచిస్తున్న కొద్దీ అతడిలో ఒక నిర్ణయం బలంగా రూపుదిద్దుకోసాగింది

★ ★ ★

పడక్కుర్చిలో కూర్చుని తాపీగా చుట్ట వెలిగించుకోబోతున్న రాజయ్య, శాస్త్రులను చూస్తూనే అగ్గిపుల్లను ఆర్పేసి నోటి నిండా నవ్వుతూ ఆహ్వానించాడు "రండి రండి !" అంటూ

కుశల ప్రశ్నలు- వూర్లోని విషయాలు- అవీ- యివీ అయిన తర్వాత నెమ్మదిగా విషయం కదిపాడు శాస్త్రులు.

"మన మాస్టారు గురించి మీకు తెలుసు కదా! కూతురు పెళ్ళి కోసం అహర్నిశలూ ఆరాటపడుతున్నాడు ఆ మధ్య ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగానే వుంది. "

ఆ మాటలు వింటూనే ముఖం చిట్లించిన రాజయ్య ఆ వుపోద్ఘాతం దేనికి నాందో వూహించాలని ప్రయత్నిస్తున్నాడు

"రోజు రోజుకూ రాజయ్యగారూ మనిషి మంచితనానికి- గుణగణాలకు విలువ లేకుండా పోతున్నది అంతా డబ్బు మయం అయిందంటే నమ్మండి " అంటూ మళ్ళీ ప్రారంభించాడు శాస్త్రులు, "కాస్త స్థితిమంతులు- చదువుకున్న సంస్కారవంతులైనా మానవ దృష్టిలో ఆలోచిస్తే తప్ప ఈ జాతికి మనుగడ లేదనిపిస్తోందండీ "

"ఇంతకీ అసలు విషయం చెప్పండి నేనేమీ అనుకోను " నవ్వుతూ అన్న రాజయ్యను చూసిన తర్వాత కాస్త ధైర్యం వచ్చింది శాస్త్రులుకు

"అదేనండీ! మన మాస్టారుగారి పెద్దమ్మాయి లావణ్య లేదూ ఈ మధ్య చూసారో లేదో ముమ్మూర్తులా అపరంజి బొమ్మే అనుకోండి!చూసిన ప్రతి వాడూ ఆ రూపాన్నీ- ఆ



## ప్రమాణం

"నీప్రేమ కోసం నేనేం చేయాలి, పద్మా?" పద్మను ఆవేశంగా అడిగాడు శ్రీనివాసులు.

"పుట్టబోయే నా బిడ్డకు తండ్రిగా ఉంటానని ప్రమాణం చేయాలి శ్రీనూ" అంది పద్మ.

–పద్మశ్రీ

ఇలాంటి జోక్సు మీరూ పంపవచ్చు సం

అణుకువనూ పొగిడేవాడే కానీ- ప్రతిసారీ కట్నం దగ్గరే పేచీ వచ్చి పడుతూంది మాస్టారు పరిస్థితి మనకు తెలియనిది కాదు కదా .. "

"అయితే .?" ప్రశ్నార్థకంగా చూసాడు రాజయ్య శాస్త్రులు ఆగినప్పుడు

"అయ్యా! రాజయ్యగారూ! చల్లకు వచ్చి ఇంకా ముంత దాచటమెందుకు- అసలు విషయానికే వస్తున్నాను మన డాక్టరు బాబు గొప్ప సంస్కారవంతుడు మాస్టారు గురించి పూర్తిగా తెలిసినవాడు లావణ్య అంటే కూడా కాస్త- -కూస్త ఇష్టమున్నట్లే కనిపిస్తున్నది మీరొక్కమారు 'వూ' అంటే చాలు వారిద్దరూ దంపతులయి నూరేళ్ళు సుఖంగా కాపురం చేసుకుంటారు అయ్యా-ఇది విషయం!" వూపిరి కూడా తీసుకోకుండా చెప్పి రాజయ్య వైపు చూసాడు శాస్త్రులు, అతడి ముఖంలో ఎలాంటి మార్పులొస్తున్నాయో గ్రహించాలని

కాని- తల వంచుకుని చుట్ట ముట్టించుకోవటంలో నిమగ్నుడయిన రాజయ్యలో ఏ భావాలు కదిలాయో గాని పైకి మాత్రం ఏమీ కనిపించలేదు

ముట్టించుకుని- రెండు గుక్కలు పీల్చిన తర్వాత కళ్ళు విప్పాడు ఆ పిమ్మట సూటిగా శాస్త్రులు వైపు చూస్తూ చెప్పాడు- "చూడు శాస్త్రులూ నువ్వు అడిగావు కాబట్టి నేను కూడా దాపరికం లేకుండా మాట్లాడ్తాను నిజమే! నువ్వన్నట్లు మాస్టారు గురించి- ఇంకా చెప్పాలంటే వారి బిడ్డల గురించి నాకు పూర్తిగా తెలుసు నిజంగా అందరూ అసూయపడవలసిన కుటుంబం అది "

'అయితే " అంటూ ఆతృతగా అడ్డుకోబోయాడు శాస్త్రులు

"వుండు శాస్త్రులూ నేను చెప్పేది పూర్తిగా విను నాకూ పెళ్ళి కావలసిన ఒక కూతురుంది ఆమెను గొప్ప యింటి కోడలిని చేయాలని ప్రతి తండ్రిలాగే నేనూ కలలు కంటున్నాను ఈ మధ్యనే ఓ సంబంధం కూడా కుదిరింది అబ్బాయి ఇంజనీరు కట్నం లక్ష అడిగారు సరేనన్నాను నిజానికి నా దగ్గర అంత డబ్బు లేదు శాస్త్రులూ!అయినా ఒప్పుకున్నాను ఎందుకో తెలుసా?మధుబాబు డాక్టరు వాడికీ సంబంధాలు వస్తున్నాయి లక్షకు పైగానే యిస్తామంటున్నారు వాటిలో ఒకటి స్థిరపరుచుకుని ఆ డబ్బుతో అమ్మాయికి ఒప్పుకున్న లక్ష యిచ్చేందుకు నిశ్చయించుకున్నాను మా అమ్మాయి పెళ్ళి జరగాలంటే కూడా ఇదొక్కటే మార్గం మరి !" సుదీర్ఘంగా చెప్పి, ఆరిపోయిన చుట్టను వెలిగించుకునే ప్రయత్నంలో లీనమయ్యాడు

పొల్లుపోకుండా అంతా విన్న శాస్త్రులు సమస్యను అర్థం చేసుకున్నాడు అర్థం చేసుకున్నాక ఇంకేమీ మాట్లాడలేక పోయాడు కాసేపు కూర్చున్నాక సెలవు తీసుకుని లేచాడు కూడా. అయితే - ప్రస్తుతం వున్న సమస్యల్లా విషయాన్ని మాస్టారుకెలా చెప్పటమా అని

★ ★ ★

ఆ గ్రామంలోని శ్రీరామభక్త నాటక సమాజం కొత్తలో ఒక వెలుగు వెలిగినా కాలక్రమాన మూలబడింది

ఈ మధ్యనే వూళ్ళోకి వచ్చి చేరిన మాజీ మునసబుగారి పుత్రుడు రామరాజు దానికి ప్రాణం పోసి మళ్ళీ పునరుజ్జీవింపచేసాడు దాని ఫలితమే చాలా కాలం తర్వాత ఆ రాత్రి 'స్త్రీ అభ్యుదయం' అన్న నాటక ప్రదర్శన

సాయంత్రం కావస్తుండగానే జనం గోలగా అక్కడికి చేరుకోసాగారు

తల్లికి నచ్చచెప్పి తామూ బయలుదేరారు లావణ్య-సీత

ప్రముఖుల కొరకు కేటాయించిన ముందు భాగంలో అప్పటికే సగ భాగం నిండిపోయింది ఖాళీగా వున్న రెండు కుర్చీల్లో కూర్చున్నారు అక్కాచెల్లెళ్ళు

స్టేజీపై ఏర్పాట్లు చూస్తూ హడావుడిగా తిరుగుతున్న రామరాజు దృష్టి చటుక్కున లావణ్యపై పడింది ఆమె చదువు మానేసి ఏడాది దాటింది మళ్ళీ చూడటం కుదర లేదు అప్పటికి- ఇప్పటికి ఆ అందం దిగ్వణీకృతమయింది' స్వగతంగానే అనుకుంటూ పలకరింపుగా చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయాడు

"మునసబుగారబ్బాయి రామరాజు కదూ-?"

గమనిస్తున్న సీత అడిగింది

"అవును ఇంటర్‌లో నాకు సీనియర్ ముక్తసరిగా చెప్పింది లావణ్య

మరి కాసేపటికి నాటకం ప్రారంభమయింది

హీరో పాత్రదారిగా రామరాజు వేదికపైకి వచ్చాడు

'కథాపరంగా హీరో పేదవాడు స్నేహితుడి పెళ్ళికని వెళ్తాడు అక్కడ వరకట్నం తక్కువయిందనే కారణంగా పీటల మీది పెళ్ళిని ఆపు చేయిస్తాడు పెళ్ళికుమారుని తండ్రి వధువు తండ్రి కాళ్ళా వేళ్ళా పడినా ప్రయోజనం వుండదు

గమనిస్తున్న హీరో లేచి వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ- ఆడపిల్లల దుస్థితిపై ఆవేశపూరితమయిన వుపన్యాసమిస్తాడు పురుషాధిత్యం మితిమీరిపోతున్న ఈ దేశంలోని స్త్రీ మేల్కొనాలని, 'మేల్కొని తనపై జరుగుతున్న అత్యాచారాలను ధైర్యంగా ఎదుర్కోవాలని- చివరంటా పోరాడాలని వుద్ఘాటిస్తాడు చివరికి- అదే ముహూర్తానికి ఆ అమ్మాయి మెడలో తాళికట్టి కథ సుఖాంతం చేస్తాడు టూకీగా యిదీ కథ '

నాటకం చివరి భాగం బ్రహ్మాండంగా రక్తికట్టింది ప్రేక్షకుల్లో చీమ చిటుక్కుమన్నా వినిపించేంతటి నిశ్శబ్దం ఆవరించుకుంది హీరో పాత్రలో రామరాజు గొప్పగా నటించాడు అందరి ప్రశంసలనూ పొందాడు

చూస్తున్న లావణ్య గుండెల్లోనూ ఏవో ప్రకంపనలు కదిలినయి నిజంగానే- ఈ వరకట్న దురాచారం నశిస్తే తనలాంటి ఆడపిల్లల జీవితాలలో ఎంత వెన్నెలో- నాన్నలాంటి నిస్సహాయులైన తల్లిదండ్రులు తమ శేష జీవితాలను ఎంత ప్రశాంతంగా గడుపుతారో కదా!

అసలే అందగాడు- అందులోనూ అంతటి ఆదర్శవాది మొదటిసారిగా ఒక పరపురుషునిపై ప్రత్యేకమయిన ఆసక్తి ఏర్పడింది ఆమెలో

స్టేజీ పక్కనే ఎవరితోనో మాట్లాడుతున్న రామరాజు, వెళ్ళిపోవటానికి సిద్ధపడుతున్న వారిని చూసి పడి పడిగా సమీపించాడు

"నమస్కారమండి గుర్తుంవారా?" అరచేతులు జోడించి అడిగాడు నవ్వుతూ

"ఆ గుర్తుపట్టక పోవడమేమిటి ఒక వూరివాళ్ళం!" తనూ నిర్మలంగా అంది లావణ్య పక్కనే వున్న సీతను కూడా పరిచయం చేస్తూ

"ఇంతకీ నాటకం ఎలా వుంది ?" వాళ్ళ పక్కనే నడుస్తూ అడిగాడు

"చాలా బాగుంది మీ కేరెక్టర్ మరీ ఎక్సలెంట్ జనాలను ఆదరగొట్టే సారనుకోండి" చెప్పింది సీత

"- నిజంగా మీలాంటి ఆదర్శవాదులు కొద్ది మంది వున్నా- ఎప్పుడో ఒకప్పుడు ఈ సమాజం మారుతుందన్న విశ్వాసం వుంటుందండీ" లావణ్య అననయితే అన్నది కాని అదిక చనువు తీసుకున్నానేమోనని కలవరపడింది ఆ తర్వాత

రామరాజు మాత్రం ఆమె ప్రశంసకు గలగలా. నవ్వుతూ '- థాంక్స్ రామరాజు మంచి బాలుడన్న సర్టిఫికేట్ యిచ్చిన మొదటి వ్యక్తి మీరే వెరీ వెరీ థాంక్స్ ' ఆహ్లాదంగా అన్నాడు

కాస్త ముందుకు వెళ్ళినాక వచ్చిన రెండుదారుల్లో చీలిపోయారు వాళ్ళా తర్వాత

* * * * * *

"అమ్మాయిలు కనిపించరేమిటి?" అప్పుడే వచ్చిన మాస్టారు కాళ్ళు కడుక్కుంటూ అడిగాడు

"వూళ్ళో ఏదో నాటకమట ఈ పాటికి అయిపోయే వుంటుంది మీరు రండి భోంచేద్దురుగాని " ఆ ఏర్పాటు చేస్తూ చెప్పింది అనసూయమ్మ

చాలాసేపటిదాకా మనసులోని మాట ఎలా చెప్పాలో తోచలేదు ఆమెకు

"ఏమిటి? ఏదో చెప్పాలనుకుని తటపటాయిస్తున్నావు ఏమిటో చెప్పు" సూక్ష్మగ్రాహి అయిన మాస్టారు పసిగట్టి అడగటంతో కాస్త ధైర్యం వచ్చిందావిడకు

"ఏమీ లేదండి! ఏ సంబంధం చూసినా వేలకు వేలే అడుగుతున్నారు దాని వయసు కూడా రోజు రోజుకు పెరుగుతున్నదే కాని తరగడంలేదు.. "

"ఈ వుపోద్ఘాతం ఎందుకుగాని అసలు విషయానికి రా " అసహనంగా అన్నాడు మాస్టారు ఈ మధ్య అమ్మాయి పెళ్ళి ప్రసక్తి తెస్తేనే చిరాకు పడిపోతున్నాడు కూతురు వివాహం తన అసమర్థతను మాటి మాటికీ బయట పెట్టినట్లనిపిస్తుండటంతో విసుగ్గా అన్నాడు

భర్త దోరణి గమనించిన అనసూయమ్మ మాటలు నోట్లోనే వుండిపోయాయి


"అసలు విషయమేమిటో చెప్పవే నీ దృష్టిలో ఏదయినా సంబంధం కాని వున్నదా? చెప్పనిదే నాకెలా తెలుస్తుంది?" సాధ్యమైనంత సౌమ్యంగా అడగడంతో చెప్పింది

"గోపాలరావుగారని వరదరాజపురం పంచాయితీ మెంబరు వున్నాడట చూసారూ, అతడు పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాడట కట్నకానుకల ప్రసక్తి లేదట వుత్తముడని కూడా పేరున్నట్లుంది అదీ విషయం "

ఆమె చెప్తుండగానే అతడి నొసలు ముడిపడింది ముక్కుపుటాలు అదిరినయి క్షణాల్లోనే ముఖంలోకి రక్తవర్ణం పొంగుకొచ్చింది

ఆయన ఆకృతిని చూసి పూర్తిగా భయపడి పోయింది అనసూయమ్మ అప్రయత్నంగానే చెప్తున్న మాటలు తెగిపోయినయి

"ఆ గోపాలరావు రెండవ సంబంధం కోసం



వెతుకుతున్నాడని కూడా తెలుసా? గత సంవత్సరం పురిట్లో అతడి భార్య పోయిందని ఆ పాప సంరక్షణ కోసమే మళ్లీ పెళ్ళికి తలపెట్టాడని– ఈ విషయాలన్నీ కూడా తెలుసా? తెలిసే నీ కూతురు కోసం అనుకుంటున్నావా?" ఒక్కొక్క మాట పిడుగులా కురుస్తూంటే వుగ్రుడయి పోయాడు. చివరికి ఇన్నేళ్ళు కాపరం చేసిన భార్య కూడా తన అసమర్థతను వేలెత్తి చూపిస్తున్నదన్నమాట! అంతటి అశక్తుడాతను? ఆ వూహే భరించలేకుండా వుంది ఆయనకు

"వయసు కూడా ఏమంత" ఏదో సర్ది చెప్పాలని నసిగింది అనసూయమ్మ

ఆ మాటలకు మరీ రెచ్చి పోయాడు మాస్టారు

"నోర్మూయ్ " వురుముతూ ముందున్న పళ్ళెన్ని ఒక్క తోపు తోసాడు

తనకు తెలిసినంత వరకు భర్తను ఆకృతిలో ఎప్పుడూ చూడలేదామె పూర్తిగా బెదిరిపోయింది

"ఏమంత వయసు లేదా సిగ్గులేదా ఆ మాట అనటానికి? ఇరవయి కూడా నిండని అమ్మాయికి నాలుగు పదులు దాటిన వరుడా చీ! చీ!నువ్వసలు కన్న తల్లివేనా" ఆవేశంతో పాటు ఆయాసం– ఆ ఆయాసం తెచ్చిన కన్నీళ్ళు వుక్కిరి బిక్కిరి చేసాయాయనను

"కాస్త శాంతించండి ఆ సంబంధం " ఆ విషయం ఇక వదిలేద్దామని చెప్దామనుకుంది కాని వినిపించుకునే స్థితిలో లేరాయన

"నోర్ముయ్– మళ్ళీ ఆ సంబంధం గురించి నోరెత్తావంటే పళ్ళు రాలగొడ్తాను ఏం నీ మొగుడు చచ్చిపోయాడనుకున్నావా? కూతురు పెళ్ళి కూడా చేయలేనంత వెధవ అయ్యాడని లోకానికి చాటింపు వెయ్యాలనుకున్నావా "

ఒక్కొక్క మాట సమ్మెట దెబ్బలా పడుతూంటే– అలాగే కూలబడిపోయి భర్త కాళ్ళను వాటేసుకుని బోరుమంది అనసూయమ్మ

చాలా సేపటిదాకా వాళ్ళా స్థితి నుంచి తేరుకోలేక పోయారు తేరుకున్నాక నెమ్మదిగా ఆ గుమ్మం దాటబోయిన మాస్టారు అక్కడి దృశ్యం చూసి బిగుసుకుపోయాడు కాళ్ళలో సన్నని వణుకు ప్రారంభమయింది

వసారాలో గోడనానుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నారు అక్కా చెల్లెళ్ళిద్దరూ–

* * * * * *

ఆ వూళ్ళో వున్నది రామరాజు వాళ్ళది ఒక్కటే కూరగాయల తోట కొందరు ప్రతిరోజూ మరికొందరు రెండుమూడు రోజులకు ఎలాగయితేనేం వూరివారంతా చివరికి అతడి తోటకు వెళ్ళవలసిందే

రామరాజుతో పరిచయం ఏర్పడినాక ప్రతిదినం క్రమం తప్పకుండా వెళ్ళసాగింది లావణ్య, గొప్పవాడినన్న భేషజం ఏమాత్రం లేకుండా సరదాగా మాట్లాడే రామరాజంటే తనకు తెలియకుండానే అభిమానం పెంచుకుంది ప్రేమిస్తున్నానని అనుమానం కూడా కలిగింది అలా అనిపించిన తర్వాత తను కూడా ఇదివరకటి సిగ్గు– బిడియాలు విడిచి చనువుగా ప్రవర్తించసాగింది

ఎప్పటిలాగే ఆ రోజు కూడా సంచీ తీసుకుని బయలుదేరింది ఒంటరిగా

"రా . రా. వస్తావో– రావోనని భయపడి చస్తున్నాను." చేతిలోని సిగరెట్టును విసిరేసి చిరునవ్వుతో ఆహ్వానించాడు

"అంత భయమెందుకో? రాకపోతే ఏమవుతుంది" మందహాసంతో ఎదురు ప్రశ్నించింది లావణ్య.

"–అదేమో కాని లావణ్యా నిన్ను రోజుకు ఒక్క సారయినా చూడలేకపోతే నాకేదో విపరీతమైన వెలితిగా వుంటుంది" ఆరాధనగా చూస్తూ అన్నాడు

ఆ మాటలకు లావణ్య కళ్ళలో ఏదో అనిర్వచనీయమైన మెరుపు మెరిసింది "అవునూ మీరేమిటి ఇలా వూరికి మకాం మార్చేసారు డిగ్రీ పూర్తి చేయలేదా?" అంటూ గుండెల్లోని ఆలోచనలను బలవంతంగా అదిమిపెడ్తూ సంభాషణ మార్చేసింది

ఆ మాటలకు తన సహజసిద్ధమయిన నవ్వును గలగలా కురిపించాడు రామరాజు "రెండేళ్ళకే ఓపిక నశించి పోయింది పైగా ఇక్కడి వ్యవహారాలు కూడా చూసుకోమని నాన్నగారి వత్తిడి కూడా ఎక్కువ కావటంతో ఇక తప్పలేదు " సిగరెట్టు వెలిగించుకుంటూ చెప్పాడు

దానితో కుటుంబ వ్యవహారాల వైపు మళ్ళింది వారి సంభాషణ

ఆ సమయంలో అతడెంతో ఆత్మీయుడుగా కనిపించాడు లావణ్యకు నిర్మలమైన మనస్సుతో తన సమస్యను చెప్పింది తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన– తన పెళ్ళికోసం వాళ్ళు ఎదుర్కొంటున్న పరిస్థితులను మొట్ట మొదటిసారిగా ఒక పరాయి వ్యక్తితో చెప్పుకుంది

అంతా ఓపిగ్గా విన్న రామరాజు సమీపంలోని ఆమె అరచేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు

వద్దనిపిస్తున్నా నిరాకరించలేదు లావణ్య.

"చూడు లావణ్యా! చాలా కాలం నుండి నీకో విషయం చెప్పాలనుకుంటున్నాను ఈ నాటికి ఆ అవకాశం దొరికింది నీ మీద జాలితో కాదు నేనీ మాటలు చెపుతున్నది నిన్ను మొదటి రోజు చూసినప్పుడే– పెళ్ళంటూ చేసుకుంటే నిన్నే చేసుకోవాలని నిర్ణయించుకున్నాను ..."

తనను స్పృశించి పెదవి కదల్చినప్పుడే తనీ మాటలు వూహించింది లావణ్య. కాని ప్రత్యక్షంగా వింటున్నప్పుడు మాత్రం గుండె విపరీతంగా కొట్టుకుంది కొట్టుకుని– కొట్టుకుని చివరికి ఆగిపోతుందేమోనన్న భ్రాంతి కలిగింది నిజంగానే ఈ పెళ్ళి జరిగితే– జరిగితే నాన్నకెంత ప్రశాంతి? ఎంత వుపశమనం? వృద్ధాప్యం చీకు చింతా లేకుండా గడిచి పోతుంది వీళ్ళకు డబ్బు కొదవలేదు. కట్నం తీసుకోవాలనుకుంటే రామరాజు ఈ ప్రసక్తి తెచ్చేవాడేకాదు అలా జరిగితే నాన్నగారి ఆరోగ్యం బాగుపడుతుంది సీత డిగ్రీ చదువుతుంది. ఓహ్! ఇదంతా నిజంగానే జరుగుతుందా– తను అంత అదృష్టవంతురాలా?

మంత్ర ముగ్ధలా కూర్చుండి వూహా ప్రపంచంలోకి వెళ్ళిపోయిన లావణ్య మౌనంగా వుండిపోయింది.

"– నీ కిష్టమయితేనే సుమా.." నవ్వుతూ అన్నాడీమారు రామరాజు

## "నిర్మా" సుందరికి ఆదిలోనే హంసపాదు!



నిర్మా సుందరి సంగీతా బిజలానీ నటించిన తొలి హిందీచిత్రం 'ఖాతిల్' ఈమధ్య విడుదలయింది. ఈ చిత్రం బాక్సాఫీస్ ప్రమాణాలలో సగటు స్థాయిలోవుంది అయితే ఇది విడుదలయిన రోజునే మల్టీస్టారర్ చిత్రం గంగ -జమున – సరస్వతి విడుదల కావడంతో ఆ వూపుకు యిది తట్టుకోలేక పోయింది. పాపం! సంగీతా తొలి చిత్రం ఇలా దెబ్బతినటం దురదృష్టకరంకదా! అయితే ఆమె నటించిన మరో చిత్రం హత్యార్ హిట్ కావచ్చునంటున్నారు అందులో ధర్మేంద్ర, రిషీ, సంజయ్‌దత్‌లు వుండటమే కారణం!

ఆ మాటలకు వులిక్కిపడి తేరుకుంది లావణ్య సుషుప్తావస్థలోంచి

"మీవాళ్ళు మీ..." అంటూ తడబడింది

మధ్యలోనే అందుకున్నాడు రామరాజు, "ఆ విషయం కూడా ఆలోచించాను లావణ్యా మా నాన్న ఎలాంటి పరిస్థితుల్లోనూ అంగీకరించడు ఆయన పూర్తిగా డబ్బు మనిషి అందుకని ఒకప్లాను కూడా సిద్ధంచేసి వుంచాను. ." అంటూ ఆమె కళ్ళలోకి సూటిగా చూసాడు.

ఆమె నేత్రాలు విప్పారితమయివున్నయి "ఏమిటి? అప్రయత్నంగా పెదాలు దాటివచ్చినయి మాటలు ఆ కళ్ళలో దోబూచులాడుతున్న భయాన్ని చప్పున గుర్తించాడు రామరాజు నవ్వుతూ అభయమిస్తున్నట్లుగా ఆమె అరచేయి నొక్కాడు మృదువుగా – 'అంత బయమెందుకు లావణ్యా? నాపైనమ్మకంలేదా?" అంటూ

"అహఁ అదికాదు. అదికాదు" కంగారుగా అందీసారి

అయితే యింకేం అనుమానాలు పెట్టుకోకుమరి' మనం రహస్యంగా పట్నం వెళ్ళి పెళ్ళిచేసుకుందాం వారం రోజుల తర్వాత తిరిగి వద్దాం అప్పుడు మా నాన్న ఏం చేయగలడు? వున్నది నేనొక్కడినే ఒప్పుకోక ఛస్తాడా? ఆఁ మీవాళ్ళకు కూడా తెలియనివ్వద్దు సుమా – అంతా గోప్యంగా జరిగిపోవాలి చివరికి ఎలాగూ సుఖాంతమవుతుంది సరేనా?"

అవాక్కయిపోయింది' అంతేకాదు అప్రతిభురాలయింది లావణ్య ఆ ప్రతిపాదన విని'

లేచిపోవటమా? తీసుకునివెళ్ళి ఎక్కడయినా వదిలేస్తే? పెళ్ళి చేసుకుంటే? నిప్పులాంటి నాన్న బరించగలడా? ఈ అపవాదుతో సీతపెళ్ళి ఈ జన్మకు జరుగుతుందా? ఆ ఆలోచన వస్తూనే చటుక్కున తలెత్తి రామరాజువైపు నిశితంగా చూసింది అదేపనిగా దేనికోసమో గాలించింది

అతడి చూపుల్లో ఎంతో నిజాయితీ పొంగిపొయి కొట్టొచ్చినట్లు కనిపించింది

ఛ' ఛ' తను అనవసరంగా అనుమానిస్తున్నదా' లేనిపోని భయాలు పెంచుకుంటున్నదా? అంతలోనే అనుకుంది మళ్ళీ రామరాజు అలాంటివాడు కాదు ఇన్ని రోజుల పరిచయంలో ఎన్నడూ అతడు అతిగా ప్రవర్తించలేదు ఎప్పటికీ అలా చేయడు తన జీవితం నిజంగానే నందనవనం కాబోతున్నది పెళ్ళిచేసుకుని తిరిగివచ్చిన తర్వాత నాన్న తప్పకుండా క్షమిస్తాడు రామరాజులాంటి గొప్పవాడు తనకు అల్లుడయినందుకు గర్వంతో వుప్పొంగిపోతాడు ఆ తర్వాత అతడికే బాధా వుండదు తన కుటుంబంలో ఇక కష్టాలుండవు కన్నీళ్ళుండవు వెళ్ళేటప్పుడు ఉత్తరంలో అన్ని విషయాలు వివరంగా వ్రాసిపెడ్తేసరి అలా అనుకున్నప్పుడుకాని ఆమె మనసు కాస్త కుదుటపడలేదు

(ఇంకావుంది)



# రిఫ్రిజిరేటర్‌తో చెయ్యదగినవి చెయ్యగూడనివి!

★ రిఫ్రిజిరేటర్‌ను పూర్తిగా గోడకు ఆన్చి పెట్టకండి. మధ్య కనీసం ఐదు అంగుళాల ఖాళీ వదలండి.

★ రిఫ్రిజిరేటర్‌ను సూటిగా ఎండా, వేడి తగలకుండా ఉంచండి. స్టౌకి దూరంగా ఉంచండి.

★ తడిసిన మెత్తని గుడ్డతో రిఫ్రిజిరేటర్‌ను వారానికి ఒకసారి శుభ్రం చేయండి. సబ్బు నీళ్ళు గాని, వేడినీళ్ళు గాని ఉపయోగించండి. డిటర్జెంట్లను వాడకండి.

★ ఫ్రిజ్ వెనుక ఉండే కండెన్సర్‌లో దుమ్ము చేరకుండా జాగ్రత్త తీసుకోండి.

★ మంచు పావు అంగుళం కన్న ఎక్కువ పేరుకున్నట్టయితే ఫ్రీజర్‌ను డిఫ్రాస్ట్ చెయ్యండి. తద్వారా ఫ్రీజర్‌కు చల్లబరిచే శక్తి పెరుగుతుంది.

★ వేడి పదార్థాలను ఎప్పుడూ ఫ్రిజ్‌లో పెట్టకండి. వేడి పదార్థాలు పెట్టడం ద్వారా ఫ్రిజ్ లోపల ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇతర పదార్థాలు చెడిపోవచ్చు.

★ మంచుగడ్డలను ఒకసారి కరిగించాక మళ్ళీ గడ్డ కట్టించకండి. అలా చేస్తే ఫ్రీజర్‌లోని ఆహార పదార్థాల నుంచి దుర్వాసనను సంతరించుకున్న మంచుగడ్డలు వస్తాయి. తక్కువ వ్యవధిలో ఐస్‌క్యూబ్స్ కావాలంటే ట్రే పూర్తిగా ఖాళీ చేయకుండా రెండు క్యూబ్స్ ఉంచి మిగిలిన ఖాళీల్లో నీళ్ళు నింపండి.

★ వారం కన్న తక్కువ రోజులు ఎటయినా వెళ్తున్నట్టయితే థర్మోస్టాట్‌ను తక్కువ ఉష్ణోగ్రతలో ఉంచండి. అంతకన్న ఎక్కువ రోజులు బైటికి వెళ్ళేట్టయితే ఫ్రిజ్‌ను ఖాళీ చేసి, పొడిగా, కరెంటు కనెక్షన్ విడదీసి వెళ్ళండి.

★ ఫ్రిజ్ తలుపు అవసరమయినంత సేపే తీసి ఉంచండి. లోపలికి గాలి జొరబడనిస్తే, ఫ్రిజ్ లోపలి ఉష్ణోగ్రతలో మార్పులు కలుగుతాయి.

★ గ్యాస్ నింపిన పానీయాల సీసాలను ఫ్రీజర్‌లో ఉంచకండి. ఆ సీసాలు పగిలిపోయే అవకాశం ఉంటుంది. పాల పాకెట్లు ఫ్రీజర్‌లో పెట్టుకోవచ్చు.

★ ఆహార పదార్థాల మీద సరిగా మూతలు ఉంచితే, పళ్ళు, కూరగాయలు విడిగా ఉంచితే వాసనలు రాకుండా అరికట్టవచ్చు. తినే సోడా డబ్బా మూత తెరిచి ఒక అరలో ఉంచితే లోపల గాలి బాగా శుభ్రపడుతుంది.

★ ఐస్‌క్రీమ్‌ల లాంటివి త్వరగా గడ్డ కట్టాలంటే ఒక గంట ముందుగా టెంపరేచర్ కంట్రోల్‌ను గరిష్ఠ స్థాయిలో ఉంచాలి.

★ ఆహార పదార్థాలను కావలసినంతే వేడి చేసుకోవాలి. వేడి చేసుకోవడంలో పోషక విలువలు నశిస్తాయి.

★ గడ్డకట్టిన మంచును గీకడం ఫ్రీజర్ ఉపరితలాన్ని నష్టపరుస్తుంది. ●

పెద్దకథ

# చచ్చి ఏం సాధిస్తావ్?-కొమ్మిడి మత్స్యేంద్రరెడ్డి

(గత సంచిక తరువాయి)

మాస్టారు వెళ్ళేవరకే పూరిబ యట చింతతో పూరి - [illegible] క్రింద కూర్చుని వున్నాడు రామరాజు అతనికి కొద్దిదూరంలో మోటారు సైకిలు నిలబడివుంది చిన్న బాటిలు లోంచి నేరుగా త్రాగివేస్తున్నాడు

పూర్తిగా నమిపించేంత వరకు గమనించలేదతడు చూసిన తర్వాత మాత్రం కంగారుపడ్డాడు లేవాలనుకుని కూడా కూర్చున్న చోటునుండి అంగుళం మేరకు కూడా కదలలేకపోయాడు జీవితంలో మొదటిసారిగా ఎదురయిన భయంకరక్షణాలు.

ఏం బాబూ' అమ్మాయికి బదులు ఆమె తండ్రి వచ్చాడేమిటా అని ఆశ్చర్యపోతున్నావా? తనూ అక్కడే చతికిలబడుతూ అన్నాడు మాస్టారు

బదులు చెప్పలేకపోయాడు రామరాజు అతడింకా షాక్ నుండి తేరుకోలేదు

ఈ విషయం నా కెలా తెలిసిందని అనుకుంటున్నావా? నిర్జీవంగా నవ్వాడు తన ప్రశ్నకు తానే నీకు తెలియదు బాబూ- పెళ్ళికి ఎదిగివున్న అమ్మాయి ఇంట్లో వున్నప్పుడు ఆ కన్నతండ్రి రాత్రిళ్ళు నిద్రపోలేడు అయినా- కూతురు పెళ్ళి కావాలంటే ఆమె తండ్రే కదా బాబూ ముందు మాట్లాడేది అందుకని నేనే వచ్చేసాను- మళ్ళీ మాస్టారే మాట్లాడాడు రామరాజు వంక నిశితంగా చూస్తూ

రామరాజుకు మొత్తం పరిస్థితి అయోమయంగా వుంది వున్నపళంగా ఆ చోటునుండి అదృశ్యమయిపోతే బాగుండుననిపించిందాక్షణం

చూడు -రామరాజూ' అమ్మాయిని రమ్మన్నావుట' పట్నం వెళ్ళి పెళ్ళి చేసుకుందామన్నావుట '

ఆ విషమ పరిస్థితిలోంచి ఎలా బయట పడాలా అని తీవ్రంగా ఆలోచిస్తున్న రామరాజు మాస్టారి మాటలు వింటూనే తళుక్కున స్ఫురించింది వుపాయం ఆ ఆలోచనలోని వుచితానుచితాలను ఏమాత్రం పట్టించుకో దలచుకోలేదు అందుకే మాస్టారు మాటలకు అడ్డు తగిలాడు. -అదేమిటండీ' నేను మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాననటం ఏమిటి? అలా అని చెప్పిందా? సాధ్యమైనంత అమాయకంగా ముఖం పెట్టి ఎదురు ప్రశ్నించాడు

ఈసారి దిగ్భ్రాంతి చెందడం మాస్టారు వంతయింది ఏమని సమాధానం చెప్పాలో తెలియలేదు

పలేవారే మాస్టారూ' మా నాన్న ఎలాగూనా పెళ్ళి చెయలేని స్థితిలో వున్నాడు వుద్యోగం చేస్తానంటే కూడా ఒప్పుకోవటం లేదు అందుకే ఇంట్లో తెలియకుండా వచ్చేస్తాను పట్నంలో ఏదో ఒక వుద్యోగం చూపిస్తే తన దారిన తను బ్రతుకుతానని మీ అమ్మాయి అదేపనిగా కళ్ళనీళ్ళు పెట్టుకోవటంతో జాలివేసి సరేనన్నాను అంతేకాని- నేనేమిటి మాస్టారూ మీ అమ్మాయిని పెళ్ళి చేసుకోవటం? అందమయిన అమ్మాయితో పాటు నాలుగు లక్షలు ఇస్తుకుంటామని ఎంతోమంది మా దగ్గరకు వస్తూంటే మీ అమ్మాయిని చేసుకోవడమేమిటి? పాఠం అప్పచెప్పినట్లుగా గడగడా అనేసి ముఖం తుడుచుకున్నాడు.

అవాక్కయిపోయాడు మాస్టారు. 'నీచుడా! చేసిన దుర్మార్గాన్ని కప్పి పుచ్చుకోవటానికి ఎంతకు తెగించావురా? ఒక అమాయకురాలి బ్రతుకులో నిప్పులు పోయటానికి కూడా సిద్ధపడ్డావన్నమాట'



అతడంత పచ్చిగా బొంకుతుంటే కలిగిన అసహ్యంతో లోలోనే కుమిలిపోయాడు

ఇప్పుడనుకుంటే ఏం లాభం' ఆకు వెళ్ళి ముల్లుపై పడ్డా - ముల్లు ఆకుకు తాకినా నష్టం కలిగేది మాత్రం ఆకుకే ఈ విషయం గుంబనగా, భూస్థాపితం కానీ' ఇతడిని నిలదీసినా ఏం

ప్రయోజనం - అమ్మాయి బ్రతుకు బజారు పాలవుతుంది అసలు రెండు చేతులు కలవంది శబ్దం మాత్రమెలా వస్తుంది? పరిపరివిధాలుగా ఆలోచించి, చివరికి - ఆ విషయాన్ని అంతటితోనే వదిలేయడం క్షేమమని నిశ్చయించుకుంటూ రామరాజును పల్లెత్తు మాట కూడా అనకుండా- కనీసం అతడివైపు కన్నెత్తి చూడనైనా చూడకుండా భారంగా ఇంటిత్రోవ పట్టాడు

జరిగిన విషయం తండ్రి చెప్తూంటే విస్మయంగా విన్నది లావణ్య నాభిలోంచి పుట్టుకొచ్చిన ఒక విధమైన గగుర్పాటు ఎదలో నిండిపోయి ఊపిరి సలపనీయకుండా వుక్కిరిబిక్కిరి చేసింది ఏడుద్దామనుకుంది కాని కళ్ళలోకి తడిరాలేదు అందరివైపు మార్చి మార్చి చూస్తూ వుండిపోయింది రామరాజు కట్టు కథను ఎవరయినా నమ్ముతున్నారా అని - ఒక వేళ వారిలో ఏ ఒక్కరు నమ్మినా ఆ రాత్రికే ప్రాణాలు విడవాలనుకుంది కాని ఎవరిలోనూ అలాంటి భావం ద్యోతకం కాలేదు తన కుటుంబ సభ్యులు తనపై పెంచుకున్న నమ్మకానికి ఎదలో మరింత వత్తిడి ప్రారంభమయింది

నాన్నా అంటూ ఏదో చెప్పబోయింది లావణ్య కాని చేతోనే వారించాడు మాస్టారు "చూడు తల్లీ" నాకంకేమీ చెప్పొద్దు జరిగినదంతా మన మంచికే అనుకుందాం ఈ సంఘటన నీకు మరికొంత అనుభవాన్ని నేర్పితే అంతే చాలు! ఆఁ- ఇక పడుకో అమ్మ! ఇప్పటికే చాలా పొద్దుపోయింది- అంటూ లేచాడు, అసలారాత్రి ఏమి జరగనట్లే

అందరూ ఆ సంఘటనను ఒక పీడకలగా మర్చిపోవాలని ప్రయత్నిస్తున్నారు ఆ ప్రయత్న ఫలితంగానే - ఆ ఇంట్లోకి ఒక విధమైన స్తబ్దత - వారి జీవితాల్లోకి ఒకరకమైన నిర్లిప్తత ప్రవేశించింది ఎవరికి వారే యాంత్రికంగా రోజులు గడిపేస్తున్నారు

* * * * *

దాదాపు రెండు నెలల తర్వాత - చేదు గతమంతా మరుగున పడిపోతున్న సమయంలో శాస్త్రులు మోసుకు వచ్చిన ఒక వార్త మళ్ళీ ఆ గడపలో కలకలం రేపింది

-అబ్బాయి చాలా బాగుంటాడట అనసూయా! అమ్మాయిని కూడా ఇదివరకే కాలేజీలో చూసుకున్నాడట ఇంకో వారం రోజుల్లో నేరుగా ముహూర్తాలు పెట్టుకోవటానికొ వస్తున్నారట చాలా కాలం తర్వాత చిన్న పిల్లాడిలా సంబర పడిపోతూ చెప్పాడు మాస్టారు

వర్ణనా స్థితిలో చూస్తూంటే పులకరించి పోయింది ఆవిడ హృదయం

మరి - కట్నకానుకలు వద్దనుకుంటూనే నసిగింది వుండబట్టలేక

-ఆ చింతేమీ అక్కర్లేదోయ్! అన్నీ కలిపి పాతికవేలు వాళ్ళ చేతుల్లో పెడ్తే సరిపోతుందట ఇక పెళ్ళితంతు ఎలా జరిపించినా మనిష్ట మేనని శాస్త్రులుతో కబురు పెట్టారు

## 'మృచ్ఛకటికం'లో మూన్ మూన్ సేన్

హిందీ, తెలుగు చిత్రాలలో నటించిన మూన్ మూన్ సేన్ సంస్కృతంలో తీయబోయే టి వి సీరియల్ మృచ్ఛ కటికం'లో ప్రధాన పాత్ర పోషించనున్నది అసలుసిసలైన భారతీయ మహిళ చందంగా వుండే ఈమె ఈ సీరియల్‌లో ప్రదాన పాత్రకు సరిపోతుందని అంటున్నారు వాండి చిత్రాలలో ఆమె డైలాగులు డబ్ చేసినట్లే సంస్కృతంలో కూడా డబ్ చేయవలసి వుంటుంది మరి మూన్ మూన్ గొంతుకు సరిపడే విధంగ సంస్కృతంలో ఎవరు డైలాగులు చెప్తారో ఏ మేరకు ఆమె తన ప్రతిభతో



పి ఎ ప్రేక్షకులను అలరింప చేస్తారో వేచి చూడాలి' తమిళంగు వచ్చింది కనుక అందరూ అన్ని భాషా చిత్రాలలోను నటించవచ్చును. వెనుకటి స్వారిదమిస వసన్త ఆదుర్తంకరం బారాగా వేయలేదా?

అంత సంతోషకరమైన వార్త చెబుతుంటే కూడా భార్య వహించిన మౌనం అతడిని చికాకు పరిచింది -చూడు అనసూయా? బ్యాంకులో ఇరవయి వేలు సిద్ధంగా వున్నయి అయిదు వేలు కలిపి వారికిచ్చేస్తే ఆ సమస్య తీరిపోతుంది పెళ్ళి ఖర్చులకు మరో అయిదు - ఘనంగానే చేద్దాం

అంటే ఇంకా పదివేలు కావాలి! అంటూ ప్రశ్నిస్తున్న అనసూయమ్మ చూపులకు చిరునవ్వుతో జవాబు చెప్పాడు అదీ జరిగిపోయిందోయ్! ఈ ఇల్లుకు బేరం పెట్టాను ఆ తర్వాత మనం వుండేందుకు అద్దె ఇల్లు కూడా చూశాను ఏది ఏమయినా- అప్పు అయితే చేయటం లేదు నా పెన్షను ఎలానూ వస్తుంది ట్యూషన్ల డబ్బులు కూడా ఏవో వస్తూనే వున్నయి వుత్సాహంగా చెప్పుకు పోతున్న భర్త వైపు ఆనందాశ్చర్యాలతో చూస్తూండి పోయింది అనసూయమ్మ ఆమెకప్పుడు భవిష్యత్తు గురించిన ఆలోచన లేదు- ఆందోళన లేదు అందుకు ఒక్కటే కారణం, తన భర్తలో ఇంకా శక్తి వుంది వుత్సాహం వుంది ఇంట్లో నవ్వులు కురుస్తున్నాయి బిడ్డ జీవితం బంగారు పూలు పూయబోతున్నది ఇక తనకే విచారం లేదు అన్నీ సరిచూసుకోవటానికి తన భర్త వున్నాడు అది చాలు- తృప్తిగా కళ్ళు తుడుచుకుంది

మరో రెండు రోజులు గడిచిపోయినయి ఇంటికి వెల్ల వేయటం పూర్తయింది పెళ్ళికి కావలసిన సరకులు- బట్టలు తేవటానికి శాస్త్రులును మరునాడే పట్నం పంపించాలని అనుకున్నారు ఇక ఇల్లు అమ్మకం విషయం పెళ్ళి జరిగిన తర్వాత ఖరారు చేసే విధంగా- డబ్బు మాత్రం ముందే ఇచ్చేట్లుగా మాట్లాడు కున్నారు కొనే ఆసామి కూడా ఆ వూరి వాడే కావటం మూలానా- మాస్టారి నీతి- నిజాయితీలను ఎంతో కాలంగా చూస్తున్నందు వలన ఆ విషయంలో ఏ పేచీ రాలేదు అంతా సవ్యంగా - చకచకా జరిగి పోతున్నది

* * * * * *

సంధ్య చీకట్లింకా విచ్చుకోలేదు చీకటీ- వెలుతురూ కాని సంధ్య వెన్నెల లాంటి మధ్యమ స్థితి అప్పుడప్పుడే నిద్రలు లేచిన పక్షుల కువకువలు- కూతలు- కావుకావులు ఇళ్ళ వద్ద కట్టేసుకున్న గోవులను లేగలను విడుచుకుని పొలాల వైపు సాగిపోతున్న రైతులు వాకిళ్ళు వూడుస్తూ- కళ్ళాపులు చల్లుతూ ముగ్గులు సింగారిస్తూ మరో శుభోదయానికి హడావిడిగా స్వాగత సన్నాహాలు చేస్తున్న ఇల్లాళ్ళూ- కన్నెపిల్లలూ

ఎప్పటిలాగే- ప్రతిరోజులాగే రాజాపురంలో మళ్ళీ తెల్లవారింది మరో దినం ప్రారంభ మయింది

కాని- కాని వాతావరణంలో మాత్రం ఏదో వెలితి సన్నగా వీస్తున్న చల్లని గాలిలో ఏవో అనిశ్చితమయిన ప్రకంపనాలు

ఊరికి ప్రధానాసవున్న మాస్టారు యింటి వేపు పరుగు తీస్తున్నాడొక వ్యక్తి అంత చల్లదనంలోనూ అతడి నుదుటి నుండి చెవుల వెనగ్గా జారుతున్న స్వేదం.

పూల మొక్కలకు నీళ్ళు పోయాలని బయటకు వచ్చిన మాస్టారు వాకిట్లోనే నిలబడి పోయాడు ఆగంతకుడిని ప్రశ్నార్థకంగా చూస్తూ

అతడు చెప్తున్న మాటలు వింటూంటే నోసలు ముడి పడిపోయింది క్రమక్రమంగా కళ్ళు వెడల్పుగా విచ్చుకున్నయి రక్త ప్రసరం వాల్చి పటిల్లున పగిలి పోతాయేమో నన్నంత విశాలంగా విచ్చుకున్నయి ఆ చూపుల్లో అంతులేనంత అపనమ్మకం- కోటాను కోట్ల విశాచాలు ఒక్కసారిగా ముట్టడించి దేహంలోని రక్తాన్నంతా పీల్చేసినట్లు తెల్లగా పాలిపోయిన ఆ వ్యక్తి ముఖంలో బ్రహ్మాండం

# చచ్చి ఏంసాధిస్తావ్?

బ్రద్దలవుతున్నప్పటి భయం– గగుర్పాటు

కనురెప్పలు కొట్టటం పూర్తిగా మర్చి పోయాడు వూపిరి పీల్చటం ఆగిపోయింది ఆ క్షణం పూర్తిగా అచేతనుడయి పోయాడు

'మాస్టారూ మాస్టారూ అయ్యో ఆయనను ఆ స్థితిలో చూస్తున్న ఆ వ్యక్తికి కూడా కాళ్ళలో వణకుపుట్టి ఆదుర్దాగా పిలిచాడు

అప్పుడు వచ్చింది మాస్టారులోకి చైతన్యం వులిక్కిపడి చూసాడు

మరుక్షణం వూరికి వుత్తరం వైపు పరుగు తీసాడు ఆ వయసులోనూ అతడిలో ఏదో శక్తి ప్రవేశించింది అతడికి కొద్ది దూరంలో అనుసరించింది అతడి ధర్మపత్ని అనసూయమ్మ

ఆయన అడుగుల ధ్వనికి ఆ వుదయం అంతా గడగడ వణికి పోయింది చేస్తున్న పనులు విడిచి అందరూ ఆ దిశకే దౌడు తీసారు

అక్కడ– చిన్న చిన్న పలుగురాళ్ళ గుట్టపైపడి వుంది లావణ్య ఆ పేరులోని లావణ్యం అంతా శరీరంలోకి పాకి ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు గా వుంది పక్కనే పడివున్న ఎండ్రిను డబ్బా

ఆ దృశ్యం చూసిన అందరూ అప్రతిభు లయ్యారు కళ్ళముందు కనిపిస్తున్నది నిజమా కాదా అన్న సందిగ్ధత

కూతురును చూసిన అనసూయమ్మ గుండెలు మాత్రం ముక్కలయి పోయినయి ఆమె రోదనకు అప్పుడప్పుడే వుదయిస్తున్న బాల భాస్కరుడు భయపడి పోయాడు పదహారేళ్ళ సీత తన అక్క మరణాన్ని ప్రత్యక్షంగా చూస్తూ చిగురుటాకులా వణికి పోయింది ఏడుస్తూనే తల్లిని ఓదార్చాలని విఫల ప్రయత్నం చేస్తూంది పోయింది ఆమె ఒక్కతే కాదు– శాపగ్రస్థులయిన ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని వూరు వూరంతా ఆ సమయంలో ఆరాటపడి పోయింది

ఇంత జరుగుతున్నా మాస్టారు కనుపాపల్లో మాత్రం తడి చిప్పిల్ల లేదు మానవునికి మరణం అతి సహజం అని తెలిసివున్న ఋషిలా నిర్వికారంగా నిలబడి పోయాడు జీవికి మరణం సహజమే! కాని కాని ఇదేమిటి ఇరవయి వసంతాలయినా నిండని తన పాప– ఇన్నేళ్ళు అపురూపంగా పెంచుకున్న తన చిట్టి తల్లి– తన చిట్టి తల్లి ఎలా మరణిస్తుంది? అర్ధాంతరంగా ఎలా వెళ్ళి పోతుంది? అసలు వెళ్ళిపోవాలనే ఊహ ఎలా పుట్టింది? అన్నింటిలోనూ అత్యంత పవిత్రమయిన ఈ మానవ జన్మను ఏమాత్రం జీవించకుండానే ఇలా ఇలా అర్ధాంతరంగా ఎందుకు ఆత్మార్పణం చేసుకుంది? ఓహ్! తల్లీ! ఎందుకమ్మా? ఎందుకు? ఎందుకు? రక్తం చిమ్ముతున్న ఆయన హృదయంలో ప్రళయం హోరుమని ఎగిరి పడింది

ఆయన ఆ స్థితిలోనే తిరిగి ఇంటికి చేరుకున్నాడు వాకిట్లో పరిచిన గడ్డిలో పడుకో బెట్టిన త ంత శరీరాన్ని ఇంకేమాత్రం బాదించటం యిష్టం లేని సూర్య బగవానుడు నెమ్మదిగా మబ్బుల చాటుకు తప్పుకున్నాడు

ఒక్కసారిగా మొల్లున లేచిన హృదయవిదారక రోదన ధ్వనికి గుమ్మాని కానుకుని స్వప్నావస్థలోకి కూరుకుపోయిన సీత తృళ్ళిపడింది

శవాన్ని లేవదీస్తున్నారు కూతురు శవాన్ని ఎవరినీ ముట్టనీయటం లేదు అనసూయమ్మ ఆమె రోదన రాళ్ళను కూడా కరిగిస్తుందా! అన్నట్లుంది

మాస్టారయితే– ఒక విధమయిన వున్మాద స్థితిలో వున్నాడు తనలో తానే గొణుక్కుంటున్నాడు నిర్వేదంగా నవ్వుకుంటున్నాడు వుండుండీ బిగ్గరగా ఏడుస్తూ తల కొట్టుకుంటున్నాడు అయిదు నిమిషాల కొకసారి లేచి వచ్చి కూతురు శవానికి మోకరిల్లు తున్నాడు వారినా పరిస్థితిలో చూస్తున్న ఆ వూరు మూగగా కన్నీరు కారుస్తూ వుండి పోయింది గ్రామస్థులు అతి ప్రయాసతో తల్లిదండ్రులను పట్టుకున్న తర్వాత శవయాత్ర ఆరంబ మయింది

సీత కళ్ళలో దీపం పెట్టి వెతికినా తడి కన్పించటం లేదు అది కూడా ఒక రకమయిన వున్మాద స్థితి గతరాత్రి చివరిసారిగా తోబుట్టువు– రక్తం పంచుకుని పుట్టిన తన అక్కతో గడిపిన క్షణాలు గుర్తొచ్చినయి

గతరాత్రి నిండుపున్నమి పిండారబోసి నట్లుంది వెన్నెల ఆ వెలుగులో వెల్లకిలా పడుకుని ఆకాశాన్ని తదేకంగా చూస్తున్న లావణ్య వద్దకు వచ్చింది సీత

అక్కా ' నెమ్మదిగా పిలిచింది తల తిప్పి చెల్లెలు వంక చూసింది లావణ్య ఆ కళ్ళలో చిత్రమైన కాంతి

ఏమిటక్కా– ఆలోచిస్తున్నావ్! బావగారి గురించా' తెచ్చి పెట్టుకున్న వుత్సాహంతో చిలిపిగా అనాలని ప్రయత్నించింది సీత

రామరాజు సంఘటన జరిగినప్పటి నుండీ లావణ్య ఎవరితోనూ చనువుగా వుండటం లేదు ఏమాత్రం అవకాశం దొరికినా ఒంటరిగా వుండటానికి ప్రయత్నిస్తున్నది సీత ఎంత ప్రయత్నించినా ఆమెను మళ్ళీ పూర్వపు మనిషిని చేయలేక పోయింది

బావగారి గురించే కదూ ఈసారి పక్కన కూర్చుని బుజాలు పట్టుకుని రెట్టించింది

అదో విధంగా నవ్వింది లావణ్య ఆ మాటలకు అవునూ సీతా ఆ నాడు రామరాజు చెప్పిన విషయాన్ని– అదే, నేనే అతడిని ప్రోత్సహించాననే విషయాన్ని నువ్వు కూడా నమ్మావా?" హఠాత్తుగా ఆ ప్రస్తావన రావటంతో విస్తుపోయిన సీత వెంటనే తేరుకోలేక పోయింది

నువ్వు నమ్మినట్లే వున్నావు చెల్లెలి చేయిని గుండెలపై వుంచుకుంటూ మళ్ళీ తనే అంది

## మీ జి. కె. ఎంత? 5కి జవాబులు

1. నార్వేకి చెందిన నొనికా క్రిస్టియన్‌సెన్
2 కాథరీన్ హెప్‌బర్న్ ఈమెకు నటిగా మొత్తం నాలుగు ఆస్కార్లు లభించాయి. ఆ సినిమాలు . మార్నింగ్ గ్లోరి (1932) "గెస్ హూ ఈజ్ కమింగ్ టు డిన్నర్" (67) దలయిన్ ఇన్ వింటర్ (68) ఆన్‌గోల్డెన్ పాండ్(81)
3 వీరందరిక రెండు సార్లు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నొబెల్ బహుమతి లభించింది.
   లైనస్‌పాలింగ్ కెమిస్ట్రీ (1954). శాంతి (1962)
   మేడమ్‌క్యూరీ . ఫిజిక్స్ (1903); కెమిస్ట్రీ (1911)
   జాన్‌బార్డీన్ · ఫిజిక్స్ (1956, 72)
   ఫ్రెడరిక్‌సాంగర్ . కెమిస్ట్రీ (1958, 80)
4. బెల్గాం (కర్నాటక) శాసనసభా నియోజక వర్గానిక జరిగిన ఎన్నికలలో మార్చి 5, 1985న ఉపయోగించ బడింది. అభ్యర్ధుల సంఖ్య 301.
5. అమెరికాకి చెందిన ఆల్బర్ట్ పి. క్రారీ
6. ఉస్తాద్ ఇసా
7 రామేశ్వర్ దయాళ్
8. రవీంద్ర జైన్ ప్రారంభగీతానికి స్వర్గీయ జయదేవ్.
9 జినీవా
10 ఛున్‌కంగ్

లావణ్య ఆ కంఠంలో విపరీతమైన వెలితి ఏదో అవ్యక్తమయిన వింత ప్రకంపన

సీత కళ్ళలో గిర్రున నీరు తిరిగింది అమాయకంగా అడుగుతున్న అక్కపై విపరీతమైన వాత్సల్యం పొంగు కొచ్చింది అకస్మాత్తుగా లావణ్యను కౌగలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది

"ఆ విషయం పోనీ మర్చిపో' కొద్ది సేపటి తర్వాత చెల్లెలి తల నిమురుతూ అంది లావణ్య

అందుకనేనా అక్కా! ఆ అనుమానంతో నేనా నాతో ఇంతకాలం ముభావంగా వుండి పోయావు?" కళ్ళు తుడుచుకుంటూ అడిగింది సీత

'పచ్చిపిల్లా ఎదో అలా అడగాను అంతే అంతేకాని నీ మీద నాకేమిటే అనుమానం' అదిపోనీ కాని సీతా- వున్న ఈ ఒక్క యిల్లూ అమ్మేస్తే ముందు ముందు ఏమవుతుంచట' ఎక్కడుంటారట' నీ బవిష్యత్తు ఏమవుతుంది" అణా పైసల్తో సహా నా పెళ్ళిక ఖర్చు పెట్టేస్తే నాన్నగారి ఆరోగ్యమెలా ఎలా సితా' ఇవన్ని ఎలా జరుగుతయి అమ్మావాళ్ళు ఈ మధ్య నా కేమి తెలియనీయటం లేదు నాన్నగారసలు ఎమంటున్నారు

బేలగా అడుగుతున్న ఆమెను చూసి సీత హృదయం ద్రవించి పోయింది ముందు నీ పెళ్ళి కానీ- ఆ తర్వాత చూపిస్తాను నా తడాఖా' ట్యూషన్లు చెప్పుకొనయినా ఈ సంసారాన్ని నడిపిస్తాను డిగ్రీ కూడా చదువుతాను' అత్యంత ఆత్మ విశ్వాసంతో చెప్పింది

ఆఁ ఆఁ అన్నీ చేస్తావు? నాన్నగారి సంగతి తెలియనిదా? కంఠంలో ప్రాణముండగా తన కూతుళ్ళను కష్టపడ నిస్తాడా అయినా- ఇప్పుడు నా పెళ్ళి చేయకుంటే ఏమవుతుందని? ఆ రోజు నుండి నాకూ- నాన్నకు మధ్య అగాధం ఏర్పడింది సీతా' నాన్నకు నువ్వు నచ్చచెప్ప కూడదూ ఈ పెళ్ళి వద్దని ' కళ్ళలోక నీళ్ళు వుబిక వస్తూంటే- మునిపంట దుఃఖాన్ని అదిమిపెడుతూ చెప్పింది లావణ్య

చిత్రంగా చూసింది సీత మొట్ట మొదటిసారిగా అక్క మాటల్లో- చూపుల్లో ఎదో మార్పు కనిపిస్తున్నది ఏమిటది? ఎమిటి? అంతు పట్టలేదు

అదేమిటక్కా! శుబమా అని పెళ్ళి జరగబోతూంటే అవేం మాటలు మందలించినట్లుగా అంది

నువ్వేన్నయినా చెప్పు సీతా' అమ్మా నాన్నలపై ప్రమాణం చేసి చెప్తున్నాను ఈ పెళ్ళి చేసుకుని కుటుంబాన్నంతా వీధి కెక్కించడం నా కిష్టం లేదు పిచ్చి సీతా' రేపు నీ పెళ్ళి కూడా జరగాలి అప్పుడెలా? శక్తి అంతా వుడిగిపోయిన అమ్మా నాన్నలకు ఈ సమయంలో డబ్బు అవసరం ఎంతో వుంటుంది ఆ అవసరం వచ్చినప్పుడు ఎవరి దగ్గర కెళ్తారో? ఎవరు మాత్రం ఏం చూసి ఇస్తారు? అందుకె సితా' నాకీ పెళ్ళి యిష్టం లేదు కన్నీరు పక్కనుండి జారి తలగడపై రాలుతూంటే చెప్పుకు పోయింది లావణ్య కళ్ళు విప్పకుండానే

లావణ్య ధోరణి ఎంతకూ అర్థం కాలేదు ఆమెకీ పెళ్ళి ఇష్టం లేదా? కాని ఇంకేం నిర్ణయించుకుంది? అంత ఖచ్చితంగా ఎలా చెప్తున్నది? అదే సమాధానం దొరక లేదు అర్ధరాత్రి దాటిందేమో' అక్కడే ఆమెపై చేయి వేసుకుని నిద్రలోకి జారి పోయింది సీత మళ్ళీ తెల్లవారేదాకా మెలకువ రాలేదు మెలకువ వచ్చేసరికి వచ్చేసరికి వచ్చేసరికి ఓహ్!

అప్పుడు పగిలినయి ఆమె గుండెలు అక్కా అక్కా అక్కా మరో లోకంలోకి వెళ్ళి పోయిన అక్కకు వినిపించేటంత బిగ్గరగా పిలవాలనుకుంది కాని గుండెల్లోని ఆ ఘోష పెదాలు దాటి బయటకు రాలేదు ఎంతపని చేసావు అక్కా? మరే మార్గంలేక పోయిందా? నాన్నకు నచ్చ చెప్పవచ్చు కదా? వినకపోతే చివరికి ఎదిరించి ఏదైనా వుద్యోగం చేసుకోవచ్చు కదా' తొందర పడ్డావు- తొందర పడ్డావు- తొందర పడ్డావు ఈ సమస్యకు నీ మరణం పరిష్కారం కాదక్కా

నన్ను క్షమించక్కా' నేను మాత్రం నీలా చావను చావను చావనుగాక చావను'

**(అయిపోయింది)**

## ఇ"వేమన" పద్యాలు

## "తీపు"

తీపులో న తీపు తెలియంగ ప్రాణంబు
ప్రాణవితతి కన్న పసిడి తీపు
పసిడికన్న మిగుల పడతి మాటలు తీపు
విశ్వదాభిరామ వినురవేమ

